

గోదారి గట్టుంది.. గట్టు మీన సెట్టుంది..
సెట్టు కొమ్మన పిట్టుంది..
పిట్ట మనసులో ఏముంది? ఓ... ఓ..

- ఈ సినిమా పల్లవి గుర్తుకురాగానే మనకు తెలీకుండానే మన పెదాలు కదలాడతాయి. దానికి నాలుక లయబద్ధంగా శ్రుతి కలుపుతుంది. మనసు రాగాలాపనతో పరుగులు తీస్తుంది. ఎప్పటి పాట అది... ఇప్పటికీ గోదారోళ్లకు ఇష్టమైన పాటేది అంటే ఇదేనంటారు. నిజానికి గోదావరి గుండె చప్పుడుని పట్టిచ్చే గీతాన్ని మనకు అందించిన 'మూగమనసులు' చిత్ర గీత రచయిత దాశరథికి తరతరాలుగా కృతజ్ఞతలు చెప్పుకోవాల్సిందే. నిజానికి గోదావరి జిల్లాలంటేనే ప్రకృతికి పర్యాయ పదాలు. పచ్చని చెట్లు, గోదారి గట్లతో మైమరపించే సహజ అందాల్ని కవులు, సినీ గీత రచయితలు దశాబ్దాలుగా తమ కలంతో వన్నెలద్దుతూనే ఉన్నారు. దర్శకులు తమ చిత్రాల్లో ఇటు ప్రకృతిని, అటు గోదావరి అందాల్ని మన కళ్ల ముందు సాక్షాత్కరింపజేస్తూనే ఉన్నారు. ముఖ్యంగా గోదావరి తీరం, ఆ తీరం వెంబడి ఏటిగట్లు, ఆ చెంతనే ఉండే చెట్లు, కాలువలు పారే చోట లాకులు.. ఇలా ఎన్నో సినిమాలకు షూటింగ్ స్పాట్లు. నిన్నగాక మొన్న కొవ్వూరు మండలం కుమారదేవంలో సినిమా చెట్టు కూలితే సినీ ప్రేమికులు తల్లడిల్లి పోయారు. మళ్లీ బతికించడానికి ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారు. ఇంకా ఎన్నో సినిమా చెట్లు ఉన్నాయి.. గోదావరి గట్ల వెంబడి సినిమా షూటింగ్‌ల జ్ఞాపకాలూ మెదలుతున్నాయి.. ఓసారి అటెల్లి వద్దామా...

గోదారి గట్టుంది.. గట్టు మీన సెట్టుంది!





లొల్ల లాకుల వద్ద 70 ఏళ్ల కిందటి మామిడిచెట్టు




వయ్యారి..గోదారమ్మ..

'వేదంలా ఘోషించే గోదావరి' అంటూ ఆరుద్ర రాజమహేంద్రి చారిత్రక వైభవాన్ని కళ్ల ముందుకు తీసుకొచ్చినా, వయ్యారీ గోదారమ్మ ఒళ్లంతా ఎందుకమ్మా కలవరం అంటూ వేటూరి కలం నుంచి హొయలు జాలువారినా, పిలిచే గోదారొడ్డు అంటూ శ్రీశ్రీ రాసినా, ఉరకలై గోదావరి అని ఇళయరాజా స్వర ప్రయోగాలు చేసినా, వెల్లువొచ్చి గోదారమ్మ ఎల్లాకిల్లా వద్దాదమ్మా అనే వేటూరి రచన ఇప్పటికీ వరవళ్లు తొక్కుతున్నా.. అన్నిటికీ ముడిసరుకు గోదావరి. కమల కలాలను ఉరకలెత్తించింది. వంశీ, విశ్వనాథ్ వంటి ఎందరో దిగ్గజ దర్శకుల చిత్రాల్లో గోదావరి గలగలలు కనబడాల్సిందే. గోదావరి ఒడ్డున సినిమా తీస్తే చెట్టూ.. పుట్టా.. గట్టూ ఇలా కంటికి కనిపించేవన్నీ సహజ సెట్టింగులే. 1952లో 'మరదలు పెళ్లి' సినిమాలో శ్రీశ్రీ రాసిన 'పిలిచే గోదారొడ్డు నోరూరించే బందరు లడ్డు' అంటూ సాగే పాటలో తొలిసారిగా గోదావరి ప్రస్తావన వినిపించిందని చెబుతారు. తర్వాత దాదాపుగా ప్రతీ సినీ కవి కలం కూడా గోదావరి అలలపై ఓలలాడింది.. ఆడుతూనే ఉంది. మూగమనసులు చిత్రంలో ఆరుద్ర రాసిన 'గోదారి గట్టుందీ.. గట్టుమీద చెట్టుందీ' అనే పాట వినని శ్రోత ఉండరంటే అతిశయోక్తి కాదేమో. ఉరకలై గోదావరి, వెన్నెల్లో గోదారి అందం, బద్దరగిరి రామయ్య పాదాలు కడగంగ పరవళ్లు తొక్కింది గోదారి గంగ, గోదావరి పైయ్యెద.. అంటూ ఎన్నో వందల పాటలకు ఆనాటి నుంచీ గోదారమ్మ ఆలంబన అయ్యింది. ఏటయ్యింది గోదారమ్మ, గలగల పారుతున్న గోదారిలా, గోదారి రేవులోన రాదారి నావలోన.. ఇలా ఎన్నో గీతాలు తెలిసినవే. - రాజమహేంద్రవరం

చెట్టూ..గట్టుపై సినిమాలెన్నో..

- అందమైన లొకేషన్లకు కేరాఫ్ అడ్రస్
- గోదావరి తీరంతో 'సినీ' బంధం



నాడు ఇలా..

సినిమా చెట్టు.. అనుబంధం

గోదావరి గట్టుంది.. ఆ గట్టుమీన సెట్టుండాలి. ఇది ప్రతి ఒక్కరి ఆలోచన. ఎందుకంటే ఆ గట్టుమీన ఉన్న చెట్టుపై ఇప్పటివరకు సుమారు 300 చిత్రాలు తీశారు. గోదావరితో అనుబంధం ఉన్న ప్రతి సినిమా డైరెక్టర్‌కు కొవ్వూరు మండలం కుమారదేవంలో ఆ చెట్టు గురుతే. సినీ దర్శకులు కె.విశ్వనాథ్, దాసరి నారాయణరావు, వంశీ, కె.రాఘవేంద్రరావు, డి.రామానాయుడు, జంధ్యాల, బాపు వంటి దర్శక దిగ్గజాలు తమ సినిమాల్లో ఒక్క సీన్ అయినా ఈ చెట్టు కింద చిత్రీకరించేవారు. నాటి మూగమనసుల నుంచి నేటి రంగస్థలం సినిమా వరకు ఆ చెట్టు సజీవంగా కనిపిస్తూనే ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఆ చెట్టు కాస్తా రెండుగా చీలి నెలకొరిగింది. ఈ సంఘటన ఎందరినో కలచివేసింది. దర్శకుడు వంశీ ఈనెల 8వ తేదీన వచ్చి నేలవాలిన సినిమాచెట్టును చూసి ఆవేదన వ్యక్తం చేశారు. అమరావతి నుంచి ఉన్నతాధికారుల ఆదేశాలతో అధికార యంత్రాంగం చెట్టు వద్దకు కదిలి వచ్చింది. జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్, ఫారెస్టు అధికారులు పడిపోయిన చెట్టును సందర్శించి చెట్టును బతికించడానికి తమ సహకారం అందజేస్తామన్నారు. గత ఆదివారం చెట్టు పడిపోయిందని తెలిసిన నాటి నుంచి నేటి వరకు ప్రతిరోజు పదుల సంఖ్యలో ప్రకృతి ప్రేమికులు చెట్టు వద్దకు వచ్చి చూసి వెళ్తున్నారు. ఎలాగైనా బతికించాలని కోరుతున్నారు. విరాళాలు ఇచ్చేందుకు స్థానికులతో పోటీగా ప్రవాసాంధ్రులు సైతం ముందుకొస్తున్నారు. చెట్టుతో మనిషికి ఎంత అనుబంధం ఉంటుందనేది రుజువు చేసిందీ చెట్టు..

చెట్టును బతికిస్తాం : ఇమ్మణి వెంకట్

రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్ ఆధ్వర్యంలో పడిపోయిన చెట్టు వేర్లు కట్ చేసి స్పెషల్ ట్రీట్‌మెంటు చేస్తాం. సినిమా చెట్టును 45 నుంచి 60 రోజుల్లో నిలబెట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం. ఇన్‌చార్జి ఆర్.దుర్గాప్రసాద్ నేతృత్వంలో చెట్టు కొమ్మలను కత్తిరించి ప్రత్యేకంగా తయారుచేసిన లేపనాలు పూసి కవర్ చేస్తాం. తరువాత చెట్టును క్రేన్‌ల సహాయంతో నిలబెట్టి రివిటింగ్ చేసి కొత్త వేర్లు వచ్చేలా ట్రీట్‌మెంట్ చేస్తాం. రెండు నెలల్లో చిత్రాల చెట్టు తనంతట అదే సహజ సిద్ధంగా చిగురిస్తుంది.

- కొవ్వూరు



నేడు మోడులా



చిత్రాల చెట్టు మళ్లీ చిగురించాలి

చిత్రాల చెట్టు చిగురిస్తే.. సంతోషపడే వారిలో నేను ప్రథముడిని. గోదావరి పరీవాహక ప్రాంతాల్లో తీసిన 22 చిత్రాల్లో 18 సినిమాల్లో ఏదో ఒకచోట ఈ చెట్టు సీన్ ఉంటుంది. హీరో కృష్ణ నటించిన పాడిపంటలు సినిమాతో ఈ చెట్టు ఫేమస్ అయ్యింది. కె.విశ్వనాథ్ వంటి ఎందరో దర్శకులు చిత్రాలచెట్టు వద్ద ఎన్నో సినిమాలను చిత్రీకరించారు. నా ప్రతి సినిమాలో ఈ చెట్టు వద్ద ఒక్క సీన్ అయినా తప్పనిసరిగా ఉంటుంది. నా సినిమాలే కాదు నా కథలు, నవలల్లో కూడా ఉంటుంది. గోకులంలో రాధ అని నవల రాశా. ఆ నవలలో ప్రధానమైన బ్యాగ్రౌండ్ ఈ చెట్టు, కుమారదేవం గ్రామమే. గోదారితో ఎంత అనుబంధం ఉందో ఈ చెట్టుతో అంతే అనుబంధం ఉంది. గత నాలుగు రోజులుగా ఈ చెట్టు గురించి ఎక్కడెక్కడి నుంచో సుమారు 2 వేలు మెసేజ్‌లు వచ్చాయంటే నమ్ముతారా అన్నారు. ఈ చిత్రాల చెట్టు తప్పనిసరిగా చిగురించాలి. నేను మరలా ఎక్కువ సీన్లు ఈ చెట్టు వద్ద చిత్రీకరించాలి.

- వంశీ, సినీదర్శకుడు

సినిమాలకు ఐలాండ్



ఐ.పోలవరం, ఆగస్టు 10 : చుట్టూ గోదావరి మధ్య దీవిలా ఉండే ఐలాండ్ ప్రాంతాలు పలు సినిమా షూటింగ్‌లకు వేదికగా నిలిచాయి. మండలంలోని ఎదురులంక, మురమళ్ళ, ఐ.పోలవరం, అన్నంపల్లి అక్విడెక్టు, గోదావరి ఏటిగట్టు ప్రాంతాల్లో తరచు సినిమా షూటింగ్‌లు జరుగుతుంటాయి. దాసరి నారాయణరావు దర్శకత్వంలో కొండవీటి సింహాసనం షూటింగ్ ఎదుర్లంక ప్రాంతాల్లో 15 రోజులు చిత్రీకరించారు. కొండవీటి సింహాసనం ఇక్కడే చిత్రీకరించారు. ఈ సినిమాకు అవసరమైన రావిచెట్టు మొదలు (ధర్మాసనం), దాసరి నారాయణరావు విగ్రహాన్ని ముమ్మిడివరం మండలం గాడిలంకకు చెందిన ప్రముఖ శిల్పి పెద్దిరెడ్డి వెంకటకృష్ణ మాధవరావు రూపొందించారు. రవితేజ, శ్రీయ జంటగా భగీరథ షూటింగ్ ఐలాండ్‌లో జరిగింది. ఆక్సిజన్ సినిమా చిత్రీకరణ అన్నంపల్లి అక్విడెక్టు వద్ద జరిగింది.

కోనసీమ అందాల్లో సినిమా..

పి.గన్నవరం, ఆగస్టు10: కోనసీమ అందాలంటే సినిమా షూటింగ్‌లకు నెలవు. పి.గన్నవరం మండలం పాత అక్విడెక్టుపై కాల్వతొట్టితో కలిసి ఉండడంతో పాటు గోదావరి అందాలు తోడవడంతో అప్పట్లో పలు పాత సినిమాలకు పాటలు చిత్రీకరించేవారు. శోభన్‌బాబు, వాణిశ్రీ నటించిన 'జీవనజ్యోతి'లో చిన్నిహో చిన్ని..పాట చిత్రీకరణలో కొంతభాగం సమీప పరిసరాలతో పాటు పాత అక్విడెక్టుపై చిత్రీకరించారు. 'సరిగమలు' చిత్రంలో స్వరరాగ గంగా ప్రవాహమే పాటను పాత అక్విడెక్టు కాల్వతొట్టిపై నడిచివస్తున్న హీరో వినీత్,సహనటుడు సోమయాజులుపై చిత్రీకరించారు. ఇలా చెప్పుకుంటూపోతే అలనాటి సినిమాల్లో పలు సన్నివేశాలు, పాటలను తెరకెక్కించారు. ఈనెల 9న విడుదలైన 'కమిటీ కుర్రోళ్లు' సినిమాలో జాతర, కాల్వలో పడిపోవడం తదితర సన్నివేశాలను దర్శకుడు వంశీ లాకులో చిత్రీకరించారు. ఈ సినిమా లంకల గన్నవరం గ్రామంలో కూడా ఎక్కువశాతం షూటింగ్ జరుపుకుంది.



లొల్ల లాకులు.. సెంటిమెంట్

ఆత్రేయపురం, ఆగస్టు 10: సినిమా సన్నివేశాలకు సెంటిమెంటు ఆత్రేయపురం లాకులు.. సెంట్రల్ డెల్టాకు ఆయువుపట్టుగా ఉన్న లొల్ల లాకులు, జంటలాకుల వద్ద ఎన్నో సన్నివేశాలు చిత్రీకరించారు. ఇక్కడ సన్నివేశాలు చిత్రీకరిస్తే సినిమా హిట్‌కొడతారనే దర్శక నిర్మాతల నమ్మకం. చిన్న సన్నివేశమైన ఈ ప్రాంతంలో చిత్రీకరిస్తారు. జీవితనౌక, పాడిపంటలు, సాక్షి, నీడలేని ఆడది, పల్నాటి పౌరుషం, అందాల రాముడు, సీతారామయ్యగారి మనవరాలు, మాధవయ్యగారి మనవడు, సింధూరం వంటి ఎన్నెన్నో చిత్రాలు ఇక్కడ చిత్రీకరించినవే. ఈవీవీ సత్యనారాయణ రూపొందించిన చిత్రాల్లో చాలావరకు లొల్ల బ్యాంక్ కెనాల్ కాలువ వద్ద 70 ఏళ్ల చరిత్ర కలిగిన మామిడిచెట్టు వద్ద సన్నివేశాలు రూపొందించేవారు. జంటలాకుల వద్ద సినిమా పాటలు, బొబ్బర్లంకలోని పిచ్చుకలంక వద్ద చలన చిత్ర సన్నివేశాలను రూపొందించారు.



గన్నవరం అక్విడెక్ట్‌పై చిన్నిహో చిన్న పాట చిత్రీకరణలో వాణిశ్రీ(ఫైల్)

అన్నవరంలో చెట్టు.. మెట్టు!

అన్నవరం, ఆగస్టు 10: అన్నవరంలో సినిమా షూటింగ్‌లు కోకొల్లలుగా జరిగాయి. కానీ ఇక్కడ తీసిన ప్రతి చిత్రంలో ప్రధానంగా ఆలయం ముందు ఉన్న చెట్టు, పక్కనే ఉన్న గుడి మెట్లు కనిపించేలా షూట్ తప్పకుండా ఉంటుంది. కళాతపస్వి కె.విశ్వనాథ్ అన్నవరం ఆలయానికి సంబంధించి ఒక్క సీన్ అయినా తన చిత్రంలో ఉండేలా చూసేవారు. అలా ఆయన తెరకెక్కించి అవార్డుల పంట పండించిన శంకరాభరణం హిందీ, తెలుగు వెర్షన్‌లు, సూత్రధారులు, స్వాతికిరణం, శుభప్రదం తదితర చిత్రాలు అన్నవరం కొండపై చిత్రీకరణ జరుపుకున్నాయి.అల్లూరి సీతారామరాజు, నాయుడుగారి అబ్బాయి, గురుబ్రహ్మ, నిన్నే పెళ్లాడుతా, నువ్వే..నువ్వే, గీతాగోవిందం, ఖుషీ (కొత్తది) అన్నవరంలోనే చిత్రీకరించారు.ఈ చిత్రాలన్నింటిలోను రత్నగిరి అందాలతోపాటు పంపా హొయలు, మిస్సమ్మకొండలను చిత్రీకరించేవారు. తూర్పురాజగోపురం ఎదురుగా ఉండే రావి చెట్టును ప్రత్యేకంగా చిత్రీకరించేవారు. ఇది ఆలయ ఆవిర్భావం నుంచి ఉన్నట్టు తెలుస్తోంది. శంకరాభరణం నుంచి గీతగోవిందం వరకు అన్నవరం సత్యదేవుడి ఆలయ మెట్లను షూటింగ్ స్పాట్లుగా చిత్రీకరించారు.

హిట్ చిత్రాల నిలయం.. అంతర్వేది ఆలయం

అంతర్వేది, ఆగస్టు 10: దక్షిణ కాశీగా పేరొందిన అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం సినీ తారల అదృష్ట ఆలయం. ఎన్టీఆర్, కృష్ణ, శోభన్‌బాబు వంటి అగ్ర హీరోలు సైతం అంతర్వేది, గుడిమూల, సఖినేటిపల్లి పరిసర ప్రాంతాల్లో షూటింగులు నిర్వహించి ఈ ప్రాంతాన్ని ఎందరికో పరిచయం చేశారు. ప్రేమలో పావని కల్యాణ్, రుక్మిణి, రామరామకృష్ణకృష్ణ, ఆడాళ్ల మీకుజోహార్లు వంటి సినిమాల షూటింగ్‌లు గోదావరి తీరం, సముద్రతీరంలో చిత్రీకరించారు. గుడిమూల ఏడు మేడలుతో పాటు సఖినేటిపల్లి రేవు, దిండి రిసార్ట్స్, చించినాడ, మలికిపురం, రాజోలు ప్రాంతాల్లో గోదావరి గట్ల మీద ఎక్కువగా సినిమాల షూటింగ్‌లు జరిగాయి. అంతర్వేదిలో లైట్‌హౌస్, అన్నాచెల్లెలు గట్టు, బీచ్, ఏటి గట్టు, సరుగుడు, కొబ్బరి తోటలు, పాడి పంట వంటి లొకేషన్లు చిత్రీకరణకు అనువుగా ఉంటాయి. హిట్ చిత్రాల దర్శకుడు వీవీ వినాయక్ అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి పాదాల చెంత స్క్రిప్టు పూజలుచేసి అనంతరం ఆ చిత్రాల షూటింగులను ప్రారంభించేవారు.

పోలీస్ స్టేషన్ వద్ద పెట్రోల్ పోసుకుని

ఆత్మహత్యాయత్నం

- పరువుపోయిందనే ఘాతుకం
- పరిస్థితి విషమం - కాకినాడ తరలింపు



రాజమహేంద్రవరం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : పరువుపోయిందని ఒక వ్యక్తి రాజమహేంద్రవరంలోని త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద శనివారం సాయంత్రం ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన కలకలం రేపింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. లింగపేటకు చెందిన షోలాపురి నాగ వర ప్రసాద్ సైకిల్‌కి ప్యాచ్చీలు వేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు.ఆయన భార్య ఇంటివద్ద టైలరింగ్ చేస్తారు. ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నాగళ్ల సూరిబాబు యాదవ్ నుంచి ప్రసాద్ తెలిసిన వారి ద్వారా రూ20 వేలు అప్పు తీసుకున్నాడు. దఫదఫాలుగా అప్పు తీర్చగా ఇంకా కొంత మొత్తం బాకీ ఉన్నాడు.వాటి నిమిత్తం శనివారం సూరిబాబు యాదవ్ వచ్చి అప్పు కింద ప్రసాద్ ద్విచక్ర వాహ నాన్ని తీసుకెళ్లాడు. ఆ తాళాలను ఇంట్లో పెట్టి బయటకు వెళ్లిపోయాడు.ప్రసాద్ వాళ్లింటికి వెళ్లి తాళాలు అడిగినా ఫలితం లేకపోవడంతో త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌కి వెళ్లాడు. ఆ సమయంలో ఏం జరిగిందో ఏమో కాని.. కాసేపటికి ఒంటిపై పెట్రోలు పోసుకొని నిప్పంటించుకున్నాడు. అక్కడివారు గమనించి మంటలు ఆర్పి వేసి రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. శరీరంపై సుమారు 80 శాతం కాలిన గాయాలయ్యాయి.ఆస్పత్రికి న్యాయమూర్తి చేరుకొని బాధితుడి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ అప్పారావు తెలిపారు. ప్రసాద్ స్టేషన్ లో కూర్చున్న తర్వాత ఫోన్‌లో ఎవరితోనో గట్టిగా మాట్లా డుతూ అరిచాడని తెలుస్తోంది.ఆ సమయంలో అతడి వద్ద పెట్రోలు బాటిల్ ఉన్నా ఎందుకు పోలీసులు గమ నించలేకపోయారోననే ప్రశ్నకు సమాధానం కరువైంది. తన పరువుపోయిందనే మనస్తాపంతోనే ఆత్మహత్యకు ప్రయత్నించినట్టు బాధితుడు చెబుతున్నట్టు సమాచారం.

పిడింగొయ్యిలో భూకబ్జా యత్నం



వివాదానికి కారణమైన భూమి

- 4.08 ఎకరాల భూమి వివాదం
- విజయవాడ నుంచి వచ్చి గొడవ
- ఎక్స్‌కవేటర్‌తో భూమి చదును
- అడ్డుకున్న లేఅవుట్‌దారులు
- ఉద్రిక్తంగా మారిన పరిస్థితి
- చర్చించిన తహశీల్దార్
- రికార్డు తేవాలని ఆదేశం



భూమి వద్ద సాగుతున్న గొడవ

రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు 10 : రాజమహేంద్రవరం రూరల్ మండలంలోని పిడింగొయ్యి గ్రామంలో నాలుగెకరాల డీటీసీపీ అప్రూవల్ భూమికి తాము యజమానులమంటూ కొంత మంది విజయవాడ నుంచి వచ్చి జేసీబీలతో చదును చేసి కబ్జాకు యత్నించారు.ఈ ప్లాట్ల అసలు యజమానులకు విషయం తెలిసి అక్కడకు చేరుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.పిడింగొయ్యి గ్రామంలో సర్వేనెం 372/1, 374/2,3లో లే అవుట్ ఎల్‌పి నెం 49/87లో మొత్తం 4.08 ఎకరాల్లో 95 ప్లాట్లను 1987లో జనప్రియ డీటీసీపీ అప్రూవల్‌తో కొనుగోలు చేసుకున్నారు. వాటికి అప్పుడే రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. ఈ భూమిలో రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాలు, ఏలూరు, ఇతర గ్రామాలకు చెందిన వారు ఉన్నారు. అయితే ఎవరికి వారు వారి ప్లాట్ల సరిహద్దుల్లో సిమెంట్ స్తంభాలతో పెన్సింగ్‌లు ఏర్పాటు చేసుకున్నారు. ఈ భూమిని శుక్రవారం కొంతమంది విజయవాడ నుంచి వచ్చి జేసీబీలు పెట్టి చదును చేశారు. ఈ విషయం అసలు యజమానులకు తెలియడంతో శనివారం ఉదయం వారంతా పిడింగొయ్యిలోని తమ ప్లాట్ల వద్దకు వచ్చి అడ్డగించి వారితో గొడవకు దిగారు. 1987లోనే రిజిస్ట్రేషన్ చేయించుకున్న తమ భూమిని మీరెలా మీ భూమిగా స్వాధీనం చేసుకుని చదును చేస్తారని నిలదీశారు. దీంతో అసలు యజమానులు, విజయవాడ నుంచి వచ్చిన వారికి మధ్య పెద్దగొడవే జరిగింది. సమాచారం అందుకున్న బొమ్మూరు పోలీ సులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేశారు. ఇంతలో విషయం తెలుసుకున్న రూరల్ ఇన్‌చార్జి తహశీల్దార్ రమ్య సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గా లతో మాట్లాడారు. ఇది సర్వేచేసి తమకు అధికారులు అప్పగించారని విజయవాడ నుంచి వచ్చిన వారు అంటుంటే అసలు ఇక్కడ సర్వేనే ఇటీవల జరగలేదని సంబంధిత అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇరుపక్షాల డాక్యుమెంట్లను తనవద్దకు తీసుకువస్తే వాస్తవాలు బయటకు వస్తాయని అంత వరకు ఇక్కడ ల్యాండ్ స్కేపింగ్ పనులు నిలుపుదల చేయాలని రమ్య ఆదేశించారు. బాధితుల పక్షాన టీడీపీ రాజమహేంద్రవరం అధ్యక్షుడు రెడ్డి మణేశ్వరావు నిలిచారు. బాధితులకు కూటమి ప్రభుత్వం న్యాయం చేస్తుందని స్పష్టం చేశారు. టీసీపీ అప్రూవల్ ల్యాండ్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు ఉండగా అగ్రికల్చర్ ల్యాండ్‌గా మరొకరి వద్ద డ్యాక్యుంమెంట్ల ఎలాపుట్టుకు వచ్చాయనే విమర్శలు వ్యక్తమౌతున్నాయి. ఈ లేవుట్‌ను 2019లో అప్పటి వైసీపీ ప్రభుత్వంలో కొందరు కలిసి అగ్రికల్చర్ ల్యాండ్‌గా వెబ్‌ల్యాండ్‌లో నమో దు చేసుకున్నారు. దీని వెనుక కొంత మంది అధికారుల ప్రాత ఉంది.

ఇది చాలా దారుణం



జనప్రియ పేజ్-2లో డిటీసీపీ అప్రూవల్‌లో ప్లాట్ కొన్నాం. దానికి పెన్సింగ్ వేసుకుని 1987 నుంచి ప్రొటెక్ట్ చేసుకుంటున్నాం. ఇప్పుడు ఎవరో వచ్చి ఈ భూమి అగ్రికల్చర్ ల్యాండ్ దినిని తాము కొన్నామని సరిహద్దులు చెరిపేసి హస్తగతం చేసుకోవాలని దౌర్జన్యంగా ప్రవేశించడం చాలా దారుణం. - నెక్కంటి సత్యనారాయణ



రాజమహేంద్రవరం జీజీహెచ్ ఎదుట ధర్నా చేస్తున్న సెక్యూరిటీ సిబ్బంది

జీతాల కోసం జీజీహెచ్ సెక్యూరిటీ సిబ్బంది ధర్నా

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 10 : జీతాల కోసం రాజమహేంద్రవరం జీజీహెచ్ సెక్యూరిటీ సిబ్బంది రోడ్డెక్కారు. మూడు నెలలుగా జీతాలు చెల్లించకపోతే తమ కుటుంబాలు ఎలా గడుస్తాయంటూ శనివారం నిరసనకు దిగారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్) ఎదుట ధర్నా చేపట్టారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు తాటిపాక మధు మాట్లాడుతూ పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని లేకుంటే సెక్యూరిటీ సిబ్బంది అందరూ ఈనెల 12వ తేదీ నుంచి సమ్మెకు దిగుతారన్నారు. జీతాల కోసం కాంట్రాక్టర్‌ను, ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను కలసి మొరపెట్టుకున్నా ఫలితం లేదన్నారు. పెండింగ్ జీతాలు తక్షణమే చెల్లించాలని, పీఎఫ్ అకౌంట్లు అందరికీ ఇవ్వాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని నినాదాలు చేశారు.కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు వి.కొండలరావు, యూనియన్ అధ్యక్షుడు ఎం.ప్రసాదరావు, కుమార్, పెద్దబ్బాయి, మోహన్, నరేష్, సూరిబాబు, భాగ్యలక్ష్మి, సుశీల, అనంతలక్ష్మి, విజయలక్ష్మి, మీనాక్షి, గంగారత్నం, వరలక్ష్మి, శ్రీనివాస్, శివ పాల్గొన్నారు.

అల్లూరి జిల్లాలో పతాకావిష్కరణ
చేసేది కలెక్టరే


కలెక్టర్ దినేష్‌కుమార్

రంపచోడవరం, ఆగస్టు 10: స్వాతంత్ర్య వేడుకల్లో పతాకావిష్కరణ చేసే అరుదైన అవకాశం అల్లూరి సీతారామరాజు కలెక్టర్ దినేష్‌కుమార్‌కు దక్కింది. సాధారణంగా స్వాతంత్ర్య వేడుకల్లో జిల్లా కేంద్రాల్లో పతాకావిష్కరణలను మంత్రులు చేయడం రివాజు. ఆ మేరకు 25 మంది మంత్రులను 25 జిల్లాలకు కేటాయించారు. రాష్ట్రంలో మంత్రివర్గం 25కే పరిమితం కావడంతో అల్లూరి జిల్లాకు కేటాయించడానికి మంత్రి లేరు. దీంతో ఇక్కడ పతాకావిష్కరణ బాధ్యతను కలెక్టర్ దినేష్‌కుమార్‌కే ప్రభుత్వం అప్పగించింది. దీంతో ఆయన పాడేరు జిల్లా కేంద్రంలో పతాకావిష్కరణ చేసేందుకు అక్కడి యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది.

ఇన్‌చార్జి ఈవో రమేష్‌బాబుకు
పూర్తి అదనపు బాధ్యతలు



అన్నవరం, ఆగస్టు 10: అన్నవరం దేవస్థానం ఇన్‌చార్జి ఈవోగా బాధ్యతలు స్వీకరించిన ఉప కమిషనరు డీఎల్‌వీ రమేష్‌బాబుకు శనివారం పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ ఏసీ) ఇస్తూ దేవదాయ శాఖ కమిషనరు ఉత్తర్వులు జారీచేశారు. ముందుగా ఇచ్చిన కేవలం పరిపాలనాపర ఇబ్బందులు లేకుండా ఉత్తర్వులివ్వగా శనివారం చెక్‌పవర్ జారీ చేస్తూ మరో ఉత్తర్వు ఇచ్చారు. ఈ సందర్భంగా ఈవో రమేష్‌బాబుకు ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

నేడు కాకినాడలో 'అసమాన అనసూయ'
డాక్యుమెంటరీ ప్రదర్శన


వింజమూరి అనసూయ (పాత చిత్రం)

కాకినాడ సిటీ, ఆగస్టు 10: కాకినాడ వాసి, తెలుగు జానపద సంగీత సామ్రాజ్ఞి, కళాప్రపూర్ణ వింజమూరి అనసూయాదేవి జీవిత చరిత్ర ఆధారంగా రూపొందించిన 94 నిమిషాల నిడివిగల 'అసమాన అనసూయ' డాక్యుమెంటరీ ఫిల్మ్‌ను ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు కాకినాడ సూర్యకళామందిరంలో ప్రదర్శించనున్నట్టు కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.రామచంద్రారెడ్డి తెలిపారు. తెలుగు పల్లె పదాల కథ అని, పాట ద్వారా కాకినాడ, పిఠాపురం, గోదావరి జిల్లాలు, అన్ని తెలుగు ప్రాంతాలతో పాటు స్వాతంత్ర్యోదమ చరిత్రను చెప్పే అపురూప చిత్రమన్నారు. ఈ డాక్యుమెంటరీకి దర్శకుడిగా చెన్నైకి చెందిన సీతారత్నాకర్ వ్యవహరించారన్నారు. సరస్వతి గానసభ, శ్రీరామ సమాజం, సంగీత విద్వత్సభ, సంగీత స్రవంతి, సత్కళావాహిని, నాదసుధ తదితర సంస్థల సౌజన్యంతో ఈ ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. సంగీత, సాహిత్య కళాభిమానులు అందరూ ఆహ్వానితులేనని చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రవీంద్ర. చిత్రంలో మరో మంత్రి దుర్గేష్, కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిశోర్

ఇసుక కొరత రానివ్వద్దు

- అందరికీ అందుబాటులో ఉచిత ఇసుక
- లారీలకు వెయిటింగ్ లేకుండా చర్యలు
- వారంలో డీసిల్టేషన్ ద్వారా ఇసుక
- బోట్స్‌మన్ సొసైటీలకు అనుమతి
- రాఘవ కన్‌స్ట్రక్షన్ ద్వారా డ్రెడ్జింగ్..
- మరింత ఇసుక అందుబాటులోకి
- అక్టోబరు 15 నుంచి ఓపెన్ రీచ్‌లకు అనుమతి
- ఉచిత ఇసుక విధానంపై సమీక్షలో మంత్రులు కొల్లు రవీంద్ర, కందుల దుర్గేష్

రాజమహేంద్రవరం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): 'ఇసుక కొరత రానివ్వద్దు.... ప్రజల కోసం సీఎం చంద్రబాబునాయుడు ఎంతో ఆలోచించి ఉచిత ఇసుక విధానాన్ని అమల్లోకి తెచ్చారు. అధికారులు, శాఖల మధ్య సమన్వయలోపంతో ఇసుక కొరత కొంత మేర కనిపిస్తోంది. ఈ సమస్య వెంటనే పరిష్కారం' కావాలి అని ఎక్సైజ్, మైనింగ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. శనివారం వారు తూర్పు గోదావరి జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రశాంతి అధ్వర్యంలో ఉచిత ఇసుక సరఫరాపై సమీక్షించారు. చివరి లబ్ధిదారుడికి కూడా ఇసుక అందుబాటులో ఉండాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 42 లక్షలు, డీసిల్టేషన్ పాయింట్లలో 71 లక్షల టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానంపై ప్రజల్లో కొన్ని అపోహలు ఉన్నాయని.. వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. గత ప్రభుత్వంలో దెబ్బతిన్న నిర్మాణ రంగం ఇప్పుడిప్పుడే కోలుకుంటోందన్నారు. లారీ అసోసియేషన్ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని.. ఒకట్రెండు నెలలు వేచి ఉంటే మంచి ప్రయోజనం చేకూరేలా సానుకూల నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రభుత్వం తీసుకున్న లోడింగ్, పరిపాలనాపరమైన చార్జీలు, సీనరేజ్ వంటివి చెల్లించి ఉచితంగా ఇసుక పొందవచ్చని చెప్పారు. బోట్స్‌మన్ సొసైటీల ద్వారా డీసిల్టేషన్ ఇసుకను వారంలో అందుబాటులోకి తెస్తామన్నారు. అక్టోబరు 15 నుంచి ఓపెన్ రీచ్‌లు ప్రారంభమవుతాయన్నారు. ఏపీ రీచ్‌ల్లో ఎంత ఇసుక ఉందో తెలియజేస్తామని, దానికి ట్రాన్స్‌పోర్టర్లు సహకరించాలన్నారు. సచివాలయం నుంచి ఇసుక బుక్ చేసుకోవచ్చని.. ఎవరైనా ఇసుకను తప్పుదారి పట్టిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఉచిత ఇసుక విధానం కచ్చితంగా అమలు కావల్సిందేనన్నారు. స్టాక్ పాయింట్ల వద్ద నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. సోమవారం నుంచి 8 రీచ్‌లు అందుబాటులోకి వస్తాయని, మరో 11 రీచ్‌లను రాఘవ కన్‌స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో త్వరలో అందుబాటులోకి తెస్తామన్నారు. మైనింగ్ శాఖను పూర్తిగా ప్రక్షాళన చేస్తామన్నారు. కొన్ని అక్రమాలు జరుగుతున్నట్టు ప్రచారం ఉన్నా సెబ్ అధికారులు ఎందుకు నిర్లక్ష్యంగా ఉంటున్నారని ప్రశ్నించారు. కచ్చితంగా చర్యలు తీసుకోవాలంటూ అక్షింతలు వేశారు. ఏడాదికి మూడు కోట్ల టన్నుల ఇసుక అవసరం ఉందని.... ప్రస్తుత సీజన్లో సుమారు కోటి టన్నుల ఇసుకను అందుబాటులో ఉంచామన్నారు.

పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ వాస్తవ పరిస్థితికి అనుగుణంగా ఇసుక లభ్యతపై చర్యలు తీసుకుంటున్నామన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మంచి ఆలోచనతో ఉచిత ఇసుక విధానం అమల్లోకి తెచ్చారన్నారు. కేవలం ఆపరేషన్ ఖర్చులు మాత్రమే వసూలు చేసి ఇసుక ఇస్తున్నామన్నారు. త్వరలో పూర్తి స్థాయిలో ఉచిత ఇసుక విధానాలు అమలు చేస్తామని చెప్పారు.

కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ ఇసుక రవాణాను సమర్థవంతంగా అమలు చేయడానికి మూడు బృందాలతో రిజిస్ట్రేషన్, లోడింగ్, విజిలెన్స్ ప్రక్రియలను పర్యవేక్షిస్తున్నట్టు చెప్పారు. డిప్యూటీ తహసీల్దారు ఇసుక రీచ్ మేనేజరుగా, ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. రీచ్‌ల వద్ద ఇసుక రవాణాకు ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకే అనుమతిస్తామన్నారు. జిల్లా డివిజన్, మండల స్థాయిల్లో కంట్రోలు రూమ్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. అనధికార ఇసుక నిల్వలను గుర్తించి రూ.8.82 లక్షల అపరాధ రుసుం వసూలు చేశామన్నారు. 14 కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేశామన్నారు. ఇరిగేషన్ ద్వారా 17 డీసిల్టేషన్ పాయింట్లు గుర్తించగా వాటి ద్వారా 1.83 లక్షల టన్నుల లభిస్తోందన్నారు. బోట్స్‌మన్ సొసైటీల నిర్వహణకు టెండర్లు పిలవాలని జిల్లా స్థాయి కమిటీలో నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు.

రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ ప్రజల్లో ఉచిత ఇసుక రవాణా, లోడింగ్ తదితర అంశాల్లో స్పష్టత లేకపోవడం వల్ల అపోహలు ఉన్నాయన్నారు. వాహన రవాణా ఖర్చుల విషయంలో కూడా స్థిరమైన ధర ఉండాలని చెప్పారు. పట్టా భూముల్లో ఇసుక విధానంపై మార్గదర్శకాల జారీలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోలవరం వరకు గోదావరి గట్టుకు రెండువైపులా ర్యాంపుల్లో స్టాక్ పాయింట్లు పెడితే రవాణా ఖర్చులు తగ్గుతాయని సూచించారు.

రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ వినియోగదారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఇసుక సరఫరా చేయాలన్నారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ రాజానగరం నియోజకవర్గంలో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా ప్రభుత్వ భవనాల నిర్మాణానికి ఇసుక కొరత ఏర్పడిందని, వెంటనే అమల్లోకి తెస్తే ప్రజలకు కూడా మేలు జరుగుతుందన్నారు. తాము ఎదుర్కొంటున్నామని సమస్యలను పరిష్కరించాలని లారీ అసోసియేషన్ నాయకులు, బోట్స్‌మన్ సొసైటీ నిర్వాహకులు మంత్రులకు, కలెక్టర్‌కు విన్నవించారు.

లారీ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ టోల్‌గేట్ ఫీజు, గ్రీన్ ట్యాక్స్ వంటివాటి పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. సమావేశంలో ఎస్పీ డి.నరసింహ కిశోర్, ఇన్‌చార్జి జేసీ, డీఆర్వో జి.నరసింహులు, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, ఆర్డీవో కేఎల్ జ్యోతి, ఆర్వీ రమణనాయక్, ఇరిగేషన్ సీఈ పుల్లారావు, ఎస్ఈ శ్రీనివాసరావు, మైన్స్ ఏడీ డి.సుబ్రహ్మణ్యం, డీఎల్ఎస్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు..

అల్లుడి కోసం సిద్ధం చేసిన వంద రకాల వంటలు





పిండి వంటల ఘుమఘుమలు

కొత్త అల్లుడికి వంద రకాల వంటకాలను వండి వడ్డించిన అత్తింటివారు

కిర్లంపూడి, ఆగస్టు 10: ఆషాడం ముగియడంతో శ్రావణంలో ఇంటికి వచ్చిన కొత్త అల్లుడికి ఓ అత్తింటివారు ఇలా వంద రకాల పిండి వంటలతో ఆహ్వానం పలికారు. కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం తామరాడ గ్రామంలో ఉద్దగిరి వెంకన్నబాబు, రమణి దంపతులు వారి అల్లుడు బాదం రవితేజ, కుమార్తె రత్నకుమారి కోసం స్వయంగా వంద రకాల పిండి వంటలు వండి వడ్డించారు. కొత్తగా పెళ్లయిన అబ్బాయి ఆషాడ మాసంలో దూరంగా ఉండి శ్రావణ మాసం మొదలుకాగానే అత్తారింటికెళ్లే సంప్రదాయ ముంది. దీనిలో భాగంగా అల్లుడికి అత్తవారింటి వారు సకల మర్యాదలతో స్వాగతం పలికి వారికి ఇలా రకరకాల పిండి వంటలు వండిపెట్టి వడ్డించడం పరిపాటి. గోదావరి జిల్లాల్లో ఈ సంప్రదాయం ఎప్పటినుంచో వస్తోంది. కాగా తాజాగా కొత్త జంట కోసం ఇలా 100 రకాల పిండి వంటలు చేయడం ప్రత్యేకత సంతరించుకుంది.

ప్రభుత్వ విద్యా రంగాన్ని
కాపాడుకునేందుకు రాజీలేని పోరాటం

యూటీఎఫ్ స్వర్ణోత్సవ సంబరాల్లో పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

అమలాపురం టౌన్, ఆగస్టు 10: గత వైసీపీ ప్రభుత్వ విధానాలతో అతలాకుతలమైన ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడుకునేందుకు రాజీలేని సమరశీల పోరాటాలు సాగించాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం విడుదల చేస్తున్న శ్వేతపత్రాల్లో గత ప్రభుత్వ వైఫల్యాలు తప్ప ఈ ప్రభుత్వం ఏమి చేస్తుందో స్పష్టత ఇవ్వట్లేదని ఆయన వ్యాఖ్యానించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం ఎంప్లాయిస్ హోంలో యూటీఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలను, రాష్ట్ర సదస్సును జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి ఎంటీవీ సుబ్బారావు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. తొలుత యూటీఎఫ్ పతాకాన్ని జిల్లా శాఖ అధ్యక్షుడు పెంకే వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. అనంతరం పురవీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. యూటీఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు కె.బోజయ్య మాట్లాడుతూ యూటీఎఫ్ ఆవిర్భావం నుంచి 50 ఏళ్ల కాలంలో సాధించిన విజయాలను వివరించారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, ఉపాధ్యాయుల సంక్షేమమే పరమావధిగా యూటీఎఫ్ పనిచేస్తుందని, భవిష్యత్తులోనూ ఇదే పంథా కొనసాగిస్తుందన్నారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీలు లక్ష్మణరావు, యిళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ) మాట్లాడుతూ రీ గ్రూపింగ్ స్కేల్స్ ద్వారా ఉపాధ్యాయుల వేతనాల్లో పెరుగుదలకు యూటీఎఫ్ చేసిన కృషిని వివరించారు. అప్రంటీస్ విధానం రద్దు, ఆటోమెటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ వర్తింప చేయడం, బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలను పారదర్శకంగా సాగించడంలో యూటీఎఫ్ కృషిని వివరించారు. నూతన పెన్షన్ విధానంతో ఉద్యోగ, ఉపాధ్యాయులకు వృద్ధాప్యంలో భరోసా లేని పరిస్థితి ఏర్పడిందన్నారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండు చేశారు.మారుమూల పల్లెల్లో బడుగు, బలహీనవర్గాల విద్యార్థులకు ప్రభుత్వ విద్యను చేర్చేందుకు ప్రజా సంఘాలను కలుపుకుని ఐక్య ఉద్యమాల ద్వారా పోరాడతామన్నారు. ఉపాధ్యాయులకు మెరుగైన పీఆర్సీ, పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బకాయిలు, సరెండర్ లీవ్ తదితర అంశాలను సాధించడం కోసం రాజీలేని పోరాటాలు చేసేందుకు సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ కోరారు. స్వర్ణోత్సవాల్లో భాగంగా రూపొందించిన పాటల సీడీని, కేఎస్ లక్ష్మణరావు రూపొందించిన డీఎస్సీ స్టడీ మెటీరియల్ బుక్‌ను, యూటీఎఫ్ కుటుంబ సంక్షేమ పథకాన్ని రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ ఐవీతో కలిసి ఆవిష్కరించారు. తొలుత యూటీఎఫ్ ఉద్యమ నేతల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మరో 50 ఏళ్ల పాటు విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేయడానికి యూటీఎఫ్ నిరంతర కృషి చేస్తుందని రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శులు ఎ.మల్లేశ్వరరావు, ఎస్పీ మనోహర్, అన్నారం, ఎస్.జ్యోతిబసు, అరుణకుమారి, బి.లక్ష్మీరాజా, ఉమ్మడి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెంకేవెంకటేశ్వరరావు, ఎంటీవీ సుబ్బారావు, పి.చక్రవర్తి, కె.నగేష్, పి.జయక్, షరీఫ్‌పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్

ప్రత్తిపాడు ఏఎస్ఐ పెద్దబ్బాయి గుండెపోటుతో మృతి



ప్రత్తిపాడు, ఆగస్టు 10: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా పని చేస్తున్న పి.పెద్దబ్బాయి (58) శనివారం ఉదయం గుండె పోటుతో మృతి చెందారు. ఆయనకు ఇంటి వద్ద గుండెపోటు రావడంతో కాకినాడ అపోలో ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్దబ్బాయి మృతితో సహచరులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఆయన భౌతికకాయాన్ని ప్రత్తిపాడు ఎస్ఐ ఎం. పవన్‌కుమార్, అడిషనల్ ఎస్ఐ మధుసూదనరావు, హెచ్‌సీలు శ్రీనివాస్, గోవిందు, సుబ్రహ్మణ్యం, వేణు, ప్రసాద్, రమేష్ సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. స్వగ్రామమైన లాగరాయిలో పెద్దబ్బాయి అంత్యక్రియలు నిర్వహించారు.


ఆలయ తిరువీధుల్లో ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

శ్రీనివాస గోవిందా

- వాడపల్లి వెంకన్న ఒక్కరోజు ఆదాయం రూ.37.68 లక్షలు



ఆత్రేయపురం, ఆగస్టు 10: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తుల గోవిందనామస్మరణతో మార్మోగింది. వేకువజామునే సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మీ హోమం, బాలభోగంలను శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు తీరువీధుల్లో ఏడు ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. తులభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. రాత్రి సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.37.68 లక్షలు లభించినట్టు ఉప కమిషనరు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.



భక్తులకు ట్రాఫిక్ కష్టాలు...

వాడపల్లి వచ్చే భక్తులు ట్రాఫిక్ పద్మవ్యూహంలో చిక్కుకున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పార్కింగ్ ప్రదేశం బురదమయమైంది. దీంతో భక్తులు ఎక్కడిక్కడ కార్లు పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. పలు ఆర్టీసీ డిపోల నుంచి వచ్చిన భక్తులు ట్రాఫిక్‌లో చిక్కుకుని అష్టకష్టాలు పడ్డారు. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో ఒకింత ఆందోళనకు గురయ్యారు.


అన్నప్రసాదానికి బారులు తీరిన భక్తులు

తొలి తిరుపతికి పోటెత్తిన భక్తులు



పెద్దాపురం, ఆగస్టు 10: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. సుమారు ఆరు వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.2,08,640 అన్నదాన విరాళాలుగా రూ.55,023, కేశఖండన ద్వారా రూ.9,840, లడ్డు ప్రసాద విక్రయం ద్వారా రూ.23,475, తులాభారం ద్వారా రూ.700 వెరసి... రూ.2,97,678 ఆదాయం సమకూరినట్టు ఈవో వడ్డి శ్రీనివాసరావు చెప్పారు.

చీరలు కొనేందుకు వెళ్తుండగా...

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి... భార్య, మనుమడికి గాయాలు


మృతుడు సత్తిబాబు (పాత చిత్రం)

పిఠాపురం రూరల్, ఆగస్టు 10: కాకి నాడ జిల్లా పిఠాపురం మండలం కొత్త కందరాడ గ్రామంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మరణించగా ఇద్దరికి గాయాలయ్యాయి. విరవ గ్రామానికి చెందిన కేశనకుర్తి సత్తిబాబు (52) తన అల్లుడి తమ్ముడి వివాహం నిమిత్తం ఉప్పాడలో చీరలు కొనేందుకు భార్య సత్యవేణి, మనుమడు హేమంత్‌తో కలిసి మోటారు సైకిలుపై బయల్దేరాడు. కొత్త కందరాడ వద్దకు వచ్చేసరికి సామర్లకోట నుంచి గొల్లప్రోలు వెళ్తున్న లారీ వారిని ఢీకొంది. సత్తిబాబు అక్కడికక్కడే మరణించగా సత్యవేణి, హేమంత్‌లకు గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పిఠాపురం రూరల్ ఎస్ఐ గుణశేఖర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోని ఢీకొన్న కారు

ఆటోలోంచి జారిపడి తలకు తీవ్ర గాయాలతో బాలుడి దుర్మరణం


దీపక్ మృతదేహం

ఎటపాక, ఆగస్టు 10: ఆటోని ఎదురుగా వస్తున్న కారు ఢీకొన్న ఘటనలో బాలుడు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన తునికి చెరువు గ్రామ శివారులో శనివారం జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం దుమ్ముగూడెం మండలం కొత్తపల్లి గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో కుంజా దీపక్ (14) ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు రెండు రోజులు సెలవులు రావడంతో ఇంటికి వచ్చే క్రమంలో ఆటోలో కొత్తపల్లి నుంచి ఎటపాక బయల్దేరాడు. ఆ సమయంలోనే ఎటపాక నుంచి కొత్తపల్లి వైపు కారు వస్తోంది. తునికిచెరువు వద్దకు రాగానే ఆటోని ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. దీపక్ ఆటో నుంచి కింద పడిపోగా తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదం జరిగిన సమయంలో ఆటోలో ఆరేడుగురు విద్యార్థులు ఉన్నారు. మృతి చెందిన బాలుడిది తెలంగాణలోని భద్రాది జిల్లా దుమ్ముగూడెం మండలం బండారుగూడెం గ్రామం. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

ఎనిమిది మందికి గాయాలు

అంబాజీపేట, ఆగస్టు 10: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట సెంటర్లో శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.., అల్లవరం మండలానికి చెందిన పది మంది మహిళలు ఆటోలో పి.గన్నవరం మండలం ముంగండలోని రొయ్యల ఫ్యాక్టరీకి ఆటోలో బయల్దేరారు. ఆటో అంబాజీపేట సెంటరు వద్దకు వచ్చేసరికి రావులపాలెం నుంచి అమలాపురం వైపు అతివేగంగా వస్తున్న ఆర్టీసీ బస్సు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అల్లవరం మండలం బెండమూర్లంకకు చెందిన బొంతు లక్ష్మీరాధిక, మట్టపర్తి వరలక్ష్మి, వాసర్ల పద్మ, బొంతు దుర్గ, గోడితిప్పకు చెందిన కొల్లి లక్ష్మి, సరెళ్ల అనంతలక్ష్మి, బొంతు సత్యవతి, పిల్లా దేవి, సరెళ్ల దేవి, దేవగుప్తం గ్రామానికి చెందిన ఆటో డ్రైవరు యు.నాగరాజు గాయపడ్డారు. క్షతగాత్రులను 108 అంబులెన్సులో అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు అంబాజీపేట పోలీసులు తెలిపారు.

కూటమి ప్రభుత్వ నిర్ణయం అభినందనీయం

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చంటిబాబు

దివాన్‌చెరువు, ఆగస్టు10 : ఎంతమంది పిల్లలు ఉన్నా స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీచేసేందుకు అర్హులంటూ కూటమి రాష్ట్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగిశెట్టి చంటిబాబు అన్నారు. శనివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. చంద్రబాబు సారథ్యంలోని ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంవల్ల ఎక్కువమంది పిల్లలు ఉన్నవారు స్థానిక సంస్థల ఎన్నికలకు దూరంగా ఉండాల్సిన అవసరం ఉండదని చంటిబాబు చెప్పారు.

ఏజెన్సీ సమాచారం



చింతూరు మండలం సింగన్నగూడెం మీదుగా సాగనున్న మల్కన్‌గిరి టూ పాండురంగాపురం రైల్వేలైన్

మన్యంలో రైలు కూత

● మల్కనగిరి టు భద్రాచలం వయా విలీన మండలాలు

చింతూరు, ఆగస్టు 10: మన్యంలో రైలు కూత విన్పించనుంది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ శుక్రవారం ఆమోద్ర ముద్ర వేసింది. ప్రధానమంత్రి గతిశక్తి మాస్టర్ ప్లాన్‌లో బాగంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఒడిసా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఏర్పాటుచేయనున్న కొత్త రైలు మార్గానికి రూ.24,657 కోట్ల నిధులు అవసరమని అంచనా వేశారు. ఒడిసాలోని మల్కనగిరి నుంచి తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాండురంగాపురం వరకు ఒక కొత్త లైన్ నిర్మించనున్నారు. ఈ లైన్ అల్లూరి సీతారామరాజు జిల్లాలోని విలీన మండలాలైన చింతూరు, కూనవరం, ఎటపాక మండలాల మీదుగా వెళ్తుంది. 173.63 కిలోమీటర్ల మేర ఉండే ఈ లైన్‌కు రూ.4,109 కోట్లు అవసరమని అంచనా వేశారు. కాగా మల్కనగిరి నుంచి విలీన మండలాల మీదుగా నిర్మించతలపెట్టిన లైన్‌కు సర్వే ఏడాదిన్నర క్రితమే పూర్తయ్యింది. లైన్ వెంబడి 213 వంతెనలు అవసరమని. అందులో 48 పెద్ద వంతెనలు నిర్మించాల్సి ఉంటుందని సర్వే అధికారులు ఆనాడే స్పష్టం చేశారు.ఒడిసాలోని జిల్లా కేంద్రమైన మల్కనగిరి వద్ద ప్రారంభమయ్యే రైల్వే లైన్ రాజన్‌గూడ, మహారాజ్‌పల్లి, కొవ్వాసిగూడ, బదలి, లూమిన్‌గూడ మీదుగా ఛత్తీస్‌గఢ్, ఒడిసా రాష్ట్రాల నడుమ శబరి నది దాటి అల్లూరి సీతారామరాజు జిల్లాకు చేరుకుంటుంది. తర్వాత చింతూరు మండలంలోని సింగన్నగూడెం (కన్నాపురం), కూనవరం మండలంలోని కూటూరుగట్టు, పల్లూరు మీదుగా ఎటపాక మండలం నందిగామ చేరుకుంటుంది. అక్కడి నుంచి భద్రాచలం చేరుకుని గోదావరి నది మీదుగా పాండురంగాపురం వరకు లైన్‌నిర్మితం కానుంది. విలీన మండలాల్లోని కన్నాయిగూడెం, కూటూరుగట్టు, నందిగామల్లో రైల్వే స్టేషన్ల నిర్మాణం చేపట్టనున్నట్టు సమాచారం. 2030-31 మధ్య పూర్తి చేయాలని రైల్వే శాఖ లక్ష్యంగా పెట్టుకుంది.

గండిపోశమ్మ ఆలయం ఇంకా వరదలోనే

దేవీపట్నం, ఆగస్టు 10: మండలంలోని గొందూరు గ్రామంలో గల గండిపోశమ్మ అమ్మవారి దేవస్థానం ఇంకా గోదావరి వరద నీటిలోనే మునిగి ఉంది. ఈ కారణంగా ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం అమ్మవారి దర్శనం తాత్కాలికంగా నిలుపుదల చేశామని ఆలయ జూనియర్ అసిస్టెంట్ కె.వెంకటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారి ఆలయ పరిసరాల్లోకి ఎవరూ రావద్దని, వరద ఉధృతి వల్ల గోదావరి దరిదాపులకు వెళ్లరాదని విజ్ఞప్తి చేశారు.

ఎటపాక సీఐగా కన్నపరాజు నియామకం

ఎటపాక, ఆగస్టు 10: ఎటపాక సీఐ డి.రామారావు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఎం.కన్నపరాజు నియమిస్తూ ఏలూరు రేంజ్ పోలీస్ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇంటిలిజెన్స్ విభాగంలో పనిచేస్తున్న ఆయన మరో ఐదారు రోజులో బాధ్యతలు చేపట్టే అవకాశముందని తెలుస్తోంది. కాగా ఎటపాక సీఐగా రామారావు 8 నెలలు మాత్రమే పని చేశారు. ఆయనకు ఇంకా పోస్టింగ్ ఇవ్వనట్టు తెలిసింది.

జెన్‌కో అసిస్టెంట్ సెక్యూరిటీ ఆఫీసర్ బదిలీ


సూర్యమోహన్‌రావును సత్కరిస్తున్న దృశ్యం

మోతుగూడెం, ఆగస్టు10: మోతుగూడెం ఏపీ జెన్‌కో సీలేరు కాంప్లెక్స్ అసిస్టెంట్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా వీవీ సూర్యమోహన్‌రావు విధులు నిర్వర్తిస్తున్నారు. ఈయన గతంలో కుప్పంలో సీఐ గా పనిచేసేవారు. అక్కడి నుంచి డిప్యూటేషన్‌పై జెన్‌కో శ్రీశైలంలో ఒక సంవత్సరం చేశారు. అనంతరం సీలేరు కాంప్లెక్స్ లోయర్ సీలేరు అసిస్టెంట్ సెక్యూ రిటీ ఆఫీసర్‌గా పది నెలలు చేశారు. సీఐల బదిలీల్లో భాగంగా సూర్యమోహన్‌రావును కర్నూలు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. శనివారం ఆయనకు సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు, సూపరింటెండెంట్ ఇంజనీర్ చిన కామేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భీమవరపు బాలకృష్ణ, డీఈటీ వరప్రసాద్, ఈఈ వరప్రసాద్, ఏఎస్ నాగేశ్వరరావు, సీనియర్ అక్కౌంట్స్ ఆఫీసర్ వరప్రసాద్, జీవో ఆనంద్ పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువా కప్పి వీడ్కోలు పలికారు.

యాభై ఏళ్ల సుస్థిర ప్రస్థానం యూటీఎఫ్

● ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు
● యూటీఎఫ్ భవన నిర్మాణానికి శంకుస్థాపన
● ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం


యూటీఎఫ్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఐవీ, తదితరులు

రాజమహేంద్రవరం రూరల్ ఆగస్టు10: హక్కులు, బాధ్యతలు రెండు కళ్లుగా సాగుతున్న 50 ఏళ్ల సుస్థిర ప్రస్థానం యూటీఎఫ్ అని ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. యూటీ ఎఫ్ స్వర్ణోత్సవాలలో భాగంగా బొమ్మూరులో శనివారం యూటీఎఫ్ తూర్పుగోదావరిజిల్లా నూతన భవన నిర్మాణాన్ని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పటివరకు రాష్ట్రంలో ప్రాంతీయంగాను, క్యాడర్లవారీగాను ఉపాధ్యాయ సంఘాలు ఉండేవని ప్రాంతీయ బేధాలు, కేడర్ల అసమానతలకీ తెరవేస్తూ రాష్ట్రమంతటా ఒకటే అని ఉపాధ్యాయులందరూ ఇకటే అన్న భావనతో విశాల దృక్పథంతో 1974 ఆగస్టు 10న యూటీఎఫ్ అంకురించిందని తెలిపారు. కాకినాడ, తూర్పుగోదావరి, అల్లూరి సీతారమరాజు మన్యం జిల్లా పరిధిలో యూటీఎఫ్ టీచర్లు నూతనంగా ఏర్పాటు చేసుకున్న కుటుంబ సంక్షేమ పథకం ది గోదావరి యూటీఎఫ్ ఫ్యామిలీ ఆసోసియేషన్ పేరుతో రాష్ట్ర యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్, ఎన్.వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మనోహర్, అన్నారం, లరుణకుమారి, రాష్ట్ర సంఘం నేతలు కుమార్ రాజా, లక్ష్మీరాజ, మూడు జిల్లాల యుటిఎఫ్ బాధ్యులు, కార్యకర్తలు, తదితరుల పాల్గొన్నారు.

విద్యారంగ పరిరక్షణకు యూటీఎఫ్ రాజీలేని పోరాటాలు

దివాన్‌చెరువు: విద్యారంగ పరిరక్షణకు యూటీఎఫ్ రాజీలేని పోరాటాలు చేస్తోందని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్. అరుణకుమారి అన్నారు. యూటీఎఫ్ మండలశాఖ అధ్యక్షుడు ఎం.శ్రీనుబాబు అధ్యక్షతన మండలంలోని పుణ్యక్షేత్రంలో శనివారం యూటీఎఫ్ వ్యవస్థాపక దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. అధ్యక్షుడు తెల్లమేకల వెంకటరావు స్వర్ణోత్సవ ఆవిర్భావ పతాకాన్ని ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన అరుణకుమారి మాట్లాడుతూ ఏపీటీఎఫ్ ఏర్పడిన నేపథ్యాన్ని ఆనాటి నుంచి నేటి వరకూ ఉపాధ్యాయుల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తూ అతిపెద్దసంఘంగా మలచబడ్డ పరిణామక్రమంను వివరించారు. ఈ సందర్భంగా తెల్లమేకల సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ కార్యదర్శి టీఎస్ఎస్వీ ఫణికుమార్, ఏవీ శ్రీనివాసరావు, ఎల్.సుబ్బారావు, రాజేశ్వరి, భీమయ్య, బీవీఎస్ చౌదరి, దేవీహరీష్, తదితరులు పాల్గొన్నారు.

బిక్కవోలు: బిక్కవోలులో యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ 51వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మండల కార్యదర్శి టి.రామచంద్రారెడ్డి యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నేతలు డీవీవీ. సత్యనారాయణ, అంజనీకుమార్, గోవిందరావు, శ్రీనివాస్, సతీష్ రెడ్డి, సత్యనారాయణ, ఏడుకొండలు, సతీష్‌కుమార్, సీతారాం, నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేటలో శనివారం యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. యూటీఎఫ్ తూర్పుగోదావరిజిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షురాలు ఎం.విజయగౌరీ పతాకం ఎగురవేశారు. మండల ప్రధానకార్యదర్శి ఐ.విజయ్‌బాబు, గౌరవ అధ్యక్షుడు జి.వెంకటేశ్వరరావు, అసోసియేట్ అధ్యక్షుడు సీహెచ్ వీర్రాజు, కోశాధికారి కోరిమిల్లి శ్రీనివాస్, నాయకులు శివరామకృష్ణ, కార్యదర్శులు ఎం.అనిల్, కె.శంకర్, సీహెచ్.విజయరత్నం, కె.మూర్తి, వై.మణికంఠ పాల్గొన్నారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవ పతాకావిష్కరణ

కూనవరం: యూటీఎఫ్ ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తికావడంతో కూనవరం మండల శాఖ స్వర్ణోత్సవ పతాకాన్ని ఆవిష్కరించింది. యూటీఎఫ్ నాయకుడు కన్నారావు మాట్లాడుతూ ఉపాధ్యాయ రంగంలో యూటీఎఫ్ అనేక పోరాటాలు చేసి విజయం సాధించిందన్నారు. 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్నందుకు సంతోషంగా ఉందని, ఉపాధ్యాయులు భవిష్యత్తు పోరాటాలకు సిద్ధంకావాలని పిలుపునిచ్చారు. ఎస్.రాంబాబు, టి.సుబ్బారావు, శాంత, సత్యవతి, కుమారి, నాగదుర్గ, గౌతమి, కుమారి పాల్గొన్నారు.


కూలిన కల్వర్టు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బలరామకృష్ణ

కలవచర్ల-నందరాడ రహదారికి గండి

● నిలిచిన రాకపోకలు-ఇబ్బంది పడుతున్న రైతులు
● రూ.30 లక్షలతో తాత్కాలిక కల్వర్టు నిర్మాణానికి చర్యలు

రాజానగరం, ఆగస్టు 10: ఇటీవల కురిసిన అధిక వర్షాలకు మండలంలో నందరాడ-కలవచర్ల రహదారికి గండి పడింది. దీంతో ఈమార్గం మీదుగా రాకపోకలు పూర్తిగా నిలిచిపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా ఈ రహదారి రైతులకు ప్రధాన రహదారి కావడంతో నందరాడ, గాదరాడ, కలవచర్ల గ్రామాల రైతాంగానికి ప్రధాన రహదారిగా మారింది. ప్రస్తుతం వ్యవసాయ సీజన్ కావడంతో రైతులు ఇబ్బందులను తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే బత్తుల రామకృష్ణ ఆర్అండ్‌బీ డీఈ మధుసూదనరావుతో కలిసి శనివారం గండిపడిన ప్రాంతాన్ని పరిశీలించారు. తక్షణమే కల్వర్టు నిర్మించాలని ఎమ్మెల్యే అధికారు లకు సూచించారు. రూ.30లక్షలతో తాత్కాలిక కల్వర్టు నిర్మించేందుకు డీఈ ప్రతిపాదించారు. పిల్లా సత్తిబాబు, పలువురు రైతులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్ ఇవ్వాలి

● యానిమల్‌బర్త్ కంట్రోల్ కేంద్రం తనిఖీలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు


కుక్కకు ఇచ్చే ఇంజక్షన్ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 10: రాజమహేంద్రవరంలో శునకాల బర్త్ కంట్రోల్ శస్త్ర చికిత్సలు చేయడంతో పాటు రేబిస్ వ్యాధి సోకకుండా వ్యాక్సిన్ ఇవ్వాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వెటర్నరీ వైద్యులను ఆదేశించారు. రాజమహేంద్రవరం క్వారీ సెంటర్‌లో యానిమల్ బర్త్ కంట్రోల్ విభాగాన్ని శనివారం తనిఖీ చేశారు. ప్రతిరోజు జరిగే చర్యలను అడిగితెలుసుకున్నారు. శునకాలకు వ్యాక్సిన్ వేయడం వల్ల ప్రజలు సురక్షితంగా ఉంటారని తెలిపారు. అనంతరం వెటర్నరీ వైద్యురాలు బి.అరుణ మాట్లాడుతూ ఏబీసీలో వారానికి మూడు రోజులు వ్యాక్సినేషన్ ,రెండు రోజులు సర్జరీలు, శుక్ర,శనివారాల్లో యాంటి రేబిస్ ఇంజక్షన్ వేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, వి.గోపికాంత్, నాయకులు పాల్గొన్నారు.

15 నుంచి బీజేపీ ప్రజాప్రతినిధుల వారధి

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 10 : బీజేపీ నుంచి ఎన్నికైన కేంద్ర, రాష్ట్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్యేలు వారధి కార్యక్రమంలో భాగంగా ఈనెల 15వ తేదీ నుంచి విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కేంద్రకార్యాలయంలో అందుబాటులో ఉంటారని బీజేపీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు వెల్లడించారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజా సమస్యలపై వినతులు స్వీకరిస్తారన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి ప్రతి నెలలో మొదటి సోమవారం, మూడో సోమవారం అందుబాటులో ఉంటారన్నారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రతి నెలలో నాలుగవ సోమవారం, మంగళవారం అందుబాటులో ఉంటారన్నారు. రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రతి నెలలో మొదటి మంగళవారం, మూడో మంగళవారం అందుబాటులో ఉంటారని వెల్లడించారు. బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు సోము వీర్రాజు ప్రతి నెలలో రెండో సోమవారం, రెండో మంగళవారం అందుబాటులో ఉంటారన్నారు.

'దళిత క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్లు కల్పించాలి'

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 10 : జస్టిస్ రంగనాథ్,జస్టిస్ బాలయ్య కమిషన్ అంటు కమిటీలు వేసి కాలయాపన చేస్తున్నారే తప్ప దళిత క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్లు కల్పించడంలో పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఇండియన్ క్రిస్టియన్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు జార్జ్ శ్రీమంతుల ఆవేదన వ్యక్తం చేశారు. రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. దళితులు మతస్వేచ్ఛను కోల్పోయిన 1950 ఆగస్టు 10ని తాము బ్లాక్ డేగా పరిగణించామన్నారు. రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి స్పందించి కేంద్ర ప్రభుత్వం దృష్టికి దళిత క్రైస్తవుల సమస్యలు తీసుకువెళ్లి ఎస్సీ హోదా కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ పాస్టర్లు జినెల్సన్ బాబు, ఐసీఎఫ్ ప్రతినిధులు కె రాజేష్ బాబు, కె సాల్మన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

'అంబేడ్కర్ స్మృతివనంలో వైసీపీ నీచ రాజకీయం'

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 10: విజయవాడ అంబేడ్కర్ స్మృతివనంలో అంబేడ్కర్ విగ్రహానికి ఉన్న జగన్ పేరును ఎవరో ఆగంతకులు తొలగిస్తే దానిని వైసీపీ నీచరాజకీయం చేస్తుందని టీడీపీ ఎస్సీ సెల్ నాయకుడు ధారా యేసురత్నం అన్నారు. రాజమహేంద్రవరం దేవిచౌక్‌లోని తన కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. అంబేడ్కర్ విగ్రహ శిలాఫలకానికి ఉన్న జగన్ పేరును ఎవరో తొలగిస్తే వైసీపీ నాయకులకు సిగ్గులేకుండా రాద్ధాంతం చేస్తున్నారన్నారు. రాజకీయ ఉనికి కోసం అంబేడ్కర్ విగ్రహాలతో ఆటలాడితే ఊరుకునేదిలేదని హెచ్చరించారు. జాతిప్రయోజనాలను పక్కన పెట్టి పాకులాడే మాజీ మంత్రులు మేరుగ నాగార్జున, ఆదిమూలపు సురేష్‌లను జాతీ క్షమించదన్నారు.


సత్యదేవానర్సరీలో హర్ ఘర్ తిరంగా

సత్యదేవా నర్సరీలో హర్ ఘర్ తిరంగా

కడియం, ఆగస్టు 10: కడియపులంక పుల్లా చంటియ్య - సత్యదేవా నర్సరీలో శనివారం మువ్వన్నెల జెండా ఎగురవేసి హర్‌గర్ తిరంగ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నర్సరీ ఎండీ పుల్లా సత్యనారాయణ, జిల్లా పర్యాటకశాఖ అధికారి వెంకటాచలం, జిల్లా ఉద్యాన అధికారి సుజాత, జిల్లా మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు అధికారి దుర్గేష్, తహసీల్దారు కె.పోసిబాబు, ఉద్యానశాఖ అధికారి సుధీర్, ఇన్‌చార్జి- సర్పంచ్ పాటంశెట్టి రాంజీ, ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, వైస్ ఎంపీపీ వంతం గణపతి, నర్సరీసంఘం రాష్ట్ర మాజీ మెంబర్ మార్గాని సత్యనారాయణ, మల్లు పోలరాజు, గట్టి సుబ్బారావు, మార్గాని ఏడుకొండలు, పుల్లా అబ్బులు, తిరుమలశెట్టి సూర్యభాస్కరరావు, పుల్లా రాజశేఖర్, కట్టా శివ, మల్లు శివ, తిరుమలశెట్టి శ్రీను, కార్యదర్శి దూళి విజయరాజు, వీఆర్‌వో గనిరాజు తదితరులు పాల్గొన్నారు.

'ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి'


చక్రద్వారబంధంలో జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్డీయే కూటమి నాయకులు

రాజానగరం, ఆగస్టు 10: అమృత్ మహోత్సవ్, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా మండలంలోని చక్రద్వారబంధంలో ఎన్డీయే కూటమి నాయకులు శనివారం జాతీయ పతాకాలతో గ్రామంలో ర్యాలీ, ప్రదర్శన చేపట్టారు. అనంతరం గ్రామ ప్రధాన కూడలిలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో ఈ నెల 15వరకు ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కన్వీనర్ నీరుకొండ వీరన్నచౌదరి, కో-కన్వీనర్ అడబాల గణపతిరావు, సోడసాని త్రిమూర్తులు, సోడసాని శ్రీను, పేపకాయల నాగేశ్వరరావు, సుంక ర వెంకన్నబాబు కురుమళ్ల మహేష్, పంచాయతీ కార్యదర్శి అయినవిల్లి శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

శంకరంబాడికి ఘన నివాళి

రాజమహేంద్రవరం కల్చరల్ ఆగస్టు10: మా తెలుగుతల్లి మల్లెపూద ండ గేయ రచయిత శంకరంబాడి సుందరాచార్యుల 110 జయంతి వేడు కలు రాజమహేంద్రవరం రాకా సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో శని వారం నిర్వహించారు. డాక్టర్ కంటే వీరన్నచౌదరి ఆసుపత్రి ఆవరణలోగల ఎస్పీ బాలు సాంస్కృతిక మందిరంలో శంకరంబాడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మునిసిపల్ కార్పొరేషన్ ఈఈ ఆలీ, రాకా అధ్యక్షుడు డాక్టర్ కంటే వీరన్న చౌదరి మాట్లాడుతూ మా తెలుగు తల్లి గీతం అజరామరమని ప్రశంసించారు. సన్నిధానంశాస్త్రి, తిరుమల కృష్ణమోహన్,సూరపురెడ్డి తాతారావు, వి.రాధాకుమారి, రాకా ప్రధాన కార్యదర్శి జివిరమణ, బి.రామకృష్ణ మూర్తి, సాయి, దేవకుమార్ పాల్గొన్నారు.

16 నుంచి రెవెన్యూ సదస్సులు

రాజమహేంద్రవరం ఆగస్టు10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 16వ తేదీ నుంచి సెప్టెంబరు 30వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించడానికి ప్రభుత్వ నిర్ణయించింది. దీనిలో భాగంగా భూఆక్రమణల వివాదాలు, రికార్డుల తారుమారు కావడం వంటివాటిపై నేరుగా బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారన్నారు. ఈ నెల 15న జిల్లా మంత్రి కందుల దుర్గేష్ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభిస్తారు. 16 నుంచి ప్రతీ గ్రామంలోను, రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తారు.

సెంట్రల్ జోన్ డీఎస్పీ కలిసిన టీడీపీ నేతలు

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 10 : రాజమహేంద్రవరం సెంట్రల్ జోన్ డీఎస్పీ కె.రమేష్‌బాబును టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ, రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం డీఎస్పీ కార్యాలయంలో కలిసి మొక్కను అందించారు.

నేడు జేసీ మాల్ ప్రారంభం

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 10: రాజమహేంద్రవరం ఏవీ అప్పారావు రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన జేసీ మాల్ షాపింగ్ మాల్‌ను ఆదివారం ఉదయం 11 గంటకు లాంఛనంగా ప్రారంభిస్తున్నారు. ఈ కార్యక్రమానికి సినీ హీరోయిన్ శ్రీలీల విచ్చేస్తున్నారు. ముఖ్యఅతిథు లుగా రాష్ట్ర పర్యాటక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, రాజ మహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్యచౌదరి హాజరవుతారన్నారు.

జీఎస్ఎల్ ఆధ్వర్యంలో ఇంటింటా సర్వే

● నెల రోజుల పాటు దంత సమస్యలకు ఉచిత చికిత్స


జీఎస్ఎల్ దంత వైద్యులతో అనపర్తి ఎన్డీయే కూటమి నాయకులు

అనపర్తి, ఆగస్టు 10: రాజానగరం జీఎస్ఎల్ దంత వైద్య కళాశాల ఆధ్వర్యంలో అనపర్తి మండలంలో ఇంటింటా దంత సమస్యలను గుర్తించేందుకు శనివారం 40మంది వైద్యులతో బృందం సర్వేను ప్రారంభించింది. నెల రోజులపాటు ఇంటింటా సర్వే నిర్వహించి ఉచిత వైద్య సేవలు అందించడంతో పాటు ఉచితంగా దంతాలు అందిస్తున్నారు. ఇటీవల అనపర్తి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి మూలారెడ్డి ద్వితీయ వర్ధంతి సందర్భంగా జీఎస్ఎల్ అదినేత గన్ని భాస్కరరావు ఎమ్మెల్యే నల్లమిల్లి రామ కృష్ణారెడ్డికి ఇచ్చిన హామీ మేరకు అనపర్తి మండలాన్ని ఎంపిక చేసి దంత వైద్య సేవలు ప్రారంభించారు. ముందుగా అనపర్తి పంచాయతీ కార్యాలయంలో ఎన్డీయే కూటమి నాయకులతో సమావేశమైన వైద్యులను ఎనిమిది బృందాలుగా ఏర్పాటుచేసి ఇంటింటికీ వెళ్లి దంత సమస్యలను గుర్తించి వారి వివరాలను నమోదు చేస్తున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ గంటా సునీల్ మాట్లాడుతూ వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ సూచనల మేరకు ఐడీఏ నేషనల్ హెల్త్‌మిషన్ పర్యవేక్షణలో పిక్ ఎన్ డ్రాప్ పేరుతో వైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు.కూటమి నాయకులు తమలంపూడి సుధాకరరెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, మల్లిడి శ్రీనివాసరెడ్డి, గొలుగూరి భాస్కరరెడ్డి, నూతిక బాబూరావు, ఒంటిమి సూర్యప్రకాష్, మామిడిశెట్టి శ్రీను పాల్గొన్నారు.

సేవకుడిలా పని చేస్తా : ఎమ్మెల్యే బత్తుల

కోరుకొండ, ఆగస్టు10: పార్టీలకు అతీతంగా అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తామని ప్రజలే దేవుడిగా భావించి ఒక నాయకుడిలా కాకుండా సేవకుడిలా ప్రతిఒక్కరికీ సేవలు అందిస్తానని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం కోరుకొండ మండలంలోని రాజవరం, కణుపూరు గ్రామాల్లో సందర్శించారు. గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, డ్రైనేజీ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో, పలు శాఖల అధికారులు, సచివాలయ సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కణుపూరులో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

ఎమ్మెల్సీ కంచర్లకు ఘన సత్కారం


ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌ను సత్కరిస్తున్న కోరుకొండ టీడీపీ నాయకులు

కోరుకొండ, ఆగస్టు10: ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు గాను శనివారం కోరుకొండకు వచ్చిన చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌కు తెలుగు తమ్ముళ్లు చిరు సత్కారం చేశారు. ఆ సందర్భంగా అయ నకు శ్రీ లక్ష్మీనరసింహస్వామి చిత్రపటం బహూకరించి అభినందనలు తెలిపారు. ఆయన వెంట పశ్చిమగోనగూడెం సర్పంచ్ రొంగ ల శ్రీనివాస్, టీడీపీ నాయకులు మింగి లక్ష్మీనారాయణ, రాయిపాటి సత్తిబాబు, పడగళ్ళపాటి శ్రీనివాస్, కోర్పు నరేంద్రకుమార్, కొయ్యా శామ్యూల్, మల్లేపల్లి దుర్గారావు, కోర్పు బుజ్జి, తదితరులు ఉన్నారు.

వేమగిరిలో ఉచిత వైద్యశిబిరం

కడియం, ఆగస్టు 10: వేమగిరి గ్రామానికి చెందిన రావిపాటి సూర్యశేఖర్, ప్రవీణ దంపతులు శనివారం తన కుమారుడు వెంకట సాయి హర్షిత్ పుట్టినరోజు పురస్కరించుకుని రాజానగరం జీఎస్ఎల్ ఆస్పత్రి వైద్యులచే వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశారు. కంటి, దంత సంబంధిత వ్యాధులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. రావిపాటి వెంకటరామారావు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


తైలాభిషేకం పండుగ



కడియం, ఆగస్టు 10: స్థానిక షారోను దైవిక స్వస్థతశాలలో 40 రోజుల ఉపవాస ప్రార్థనలు అనంతరం శనివారం తైలాభిషేక పండుగ నిర్వహించారు. పాస్టర్ డి.రత్నరాజు క్రైస్తవ విశ్వాసులకు తైలాభిషేకం చేసి అభిషేకించారు. బైబిల్ లేఖనాలను తెలిపారు. కార్యక్రమంలో సరోజినీ రత్నరాజు, ఫ్రాన్సిస్, సజీనిలీల, కిరణ్‌రాజు, అభిషేక్, ప్రవీణ్, సన్నిధి శ్రీలు పాల్గొన్నారు.

మేలైన పద్ధతులతో అధిక దిగుబడులు

గోకవరం, ఆగస్టు 10: పామాయిల్ తోటల సాగులో మేలైన పద్ధతులు అవలంభించడం ద్వారా అధిక దిగుబడులు సాధించ వచ్చని పతాంజలి ఫుడ్స్ లిమిటెడ్ కంపెనీ డీజీఎం ఎ.ప్రకాష్ అన్నారు. మండలంలోని గోకవరానికి చెందిన రామినీడి వెంకట శేషుబాబు అనే రైతు పొలంలో శనివారం నిర్వహించిన ఆయిల్ పామ్ తోటల విస్తరణ మహోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా పామాయిల్ మొక్కల వివరాలు, సబ్సిడీలు, డ్రిప్ ఇరిగేషన్ ప్రాముఖ్యత, అంశాలను డీజీఎం ప్రకాష్ రైతులకు వివరించారు. రైతులు దాసరి తమ్మన్నదొర, కోరుమిల్లి అప్పలస్వామి పాల్గొన్నారు.



గోదారి గట్టుంది.. గట్టు మీన సెట్టుంది!

గోదారి గట్టుంది.. గట్టు మీన సెట్టుంది..
సెట్టు కొమ్మన పిట్టుంది..
పిట్ట మనసులో ఏముంది? ఓ... ఓ..

- ఈ సినిమా పల్లవి గుర్తుకురాగానే మనకు తెలీకుండానే మన పెదాలు కదలాడతాయి. దానికి నాలుక లయబద్ధంగా శ్రుతి కలుపుతుంది. మనసు రాగాలాపనతో పరుగులు తీస్తుంది. ఎప్పటి పాట అది... ఇప్పటికీ గోదారోళ్లకు ఇష్టమైన పాటేది అంటే ఇదేనంటారు. నిజానికి గోదావరి గుండె చప్పుడుని పట్టిచ్చే గీతాన్ని మనకు అందించిన 'మూగమనసులు' చిత్ర గీత రచయిత దాశరథికి తరతరాలుగా కృతజ్ఞతలు చెప్పుకోవాల్సిందే. నిజానికి గోదావరి జిల్లాలంటేనే ప్రకృతికి పర్యాయ పదాలు. పచ్చని చెట్లు, గోదారి గట్లతో మైమరపించే సహజ అందాల్ని కవులు, సినీ గీత రచయితలు దశాబ్దాలుగా తమ కలంతో వన్నెలద్దుతూనే ఉన్నారు. దర్శకులు తమ చిత్రాల్లో ఇటు ప్రకృతిని, అటు గోదావరి అందాల్ని మన కళ్ల ముందు సాక్షాత్కరింపజేస్తూనే ఉన్నారు. ముఖ్యంగా గోదావరి తీరం, ఆ తీరం వెంబడి ఏటిగట్లు, ఆ చెంతనే ఉండే చెట్లు, కాలువలు పారే చోట లాకులు.. ఇలా ఎన్నో సినిమాలకు షూటింగ్ స్పాట్లు. నిన్నగాక మొన్న కొవ్వూరు మండలం కుమారదేవంలో సినిమా చెట్టు కూలితే సినీ ప్రేమికులు తల్లడిల్లి పోయారు. మళ్లీ బతికించడానికి ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారు. ఇంకా ఎన్నో సినిమా చెట్లు ఉన్నాయి.. గోదావరి గట్ల వెంబడి సినిమా షూటింగ్‌ల జ్ఞాపకాలూ మెదలుతున్నాయి.. ఓసారి అటెల్లి వద్దామా...



లొల్ల లాకుల వద్ద 70 ఏళ్ల కిందటి మామిడిచెట్టు





నాడు ఇలా..

సినిమా చెట్టు.. అనుబంధం

గోదావరి గట్టుంది.. ఆ గట్టుమీన సెట్టుండాలి. ఇది ప్రతి ఒక్కరి ఆలోచన. ఎందుకంటే ఆ గట్టుమీన ఉన్న చెట్టుపై ఇప్పటివరకు సుమారు 300 చిత్రాలు తీశారు. గోదావరితో అనుబంధం ఉన్న ప్రతి సినిమా డైరెక్టర్‌కు కొవ్వూరు మండలం కుమారదేవంలో ఆ చెట్టు గురుతే. సినీ దర్శకులు కె.విశ్వనాథ్, దాసరి నారాయణరావు, వంశీ, కె.రాఘవేంద్రరావు, డి.రామానాయుడు, జంధ్యాల, బాపు వంటి దర్శక దిగ్గజాలు తమ సినిమాల్లో ఒక్క సీన్ అయినా ఈ చెట్టు కింద చిత్రీకరించేవారు. నాటి మూగమనసుల నుంచి నేటి రంగస్థలం సినిమా వరకు ఆ చెట్టు సజీవంగా కనిపిస్తూనే ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఆ చెట్టు కాస్తా రెండుగా చీలి నెలకొరిగింది. ఈ సంఘటన ఎందరినో కలచివేసింది. దర్శకుడు వంశీ ఈనెల 8వ తేదీన వచ్చి నేలవాలిన సినిమాచెట్టును చూసి ఆవేదన వ్యక్తం చేశారు. అమరావతి నుంచి ఉన్నతాధికారుల ఆదేశాలతో అధికార యంత్రాంగం చెట్టు వద్దకు కదిలి వచ్చింది. జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్, ఫారెస్టు అధికారులు పడిపోయిన చెట్టును సందర్శించి చెట్టును బతికించడానికి తమ సహకారం అందజేస్తామన్నారు. గత ఆదివారం చెట్టు పడిపోయిందని తెలిసిన నాటి నుంచి నేటి వరకు ప్రతిరోజు పదుల సంఖ్యలో ప్రకృతి ప్రేమికులు చెట్టు వద్దకు వచ్చి చూసి వెళ్తున్నారు. ఎలాగైనా బతికించాలని కోరుతున్నారు. విరాళాలు ఇచ్చేందుకు స్థానికులతో పోటీగా ప్రవాసాంధ్రులు సైతం ముందుకొస్తున్నారు. చెట్టుతో మనిషికి ఎంత అనుబంధం ఉంటుందనేది రుజువు చేసిందీ చెట్టు..

చెట్టును బతికిస్తాం : ఇమ్మణి వెంకట్

రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్ ఆధ్వర్యంలో పడిపోయిన చెట్టు వేర్లు కట్ చేసి స్పెషల్ ట్రీట్‌మెంటు చేస్తాం. సినిమా చెట్టును 45 నుంచి 60 రోజుల్లో నిలబెట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం. ఇన్‌చార్జి ఆర్.దుర్గాప్రసాద్ నేతృత్వంలో చెట్టు కొమ్మలను కత్తిరించి ప్రత్యేకంగా తయారుచేసిన లేపనాలు పూసి కవర్ చేస్తాం. తరువాత చెట్టును క్రేన్‌ల సహాయంతో నిలబెట్టి రివిటింగ్ చేసి కొత్త వేర్లు వచ్చేలా ట్రీట్‌మెంట్ చేస్తాం. రెండు నెలల్లో చిత్రాల చెట్టు తనంతట అదే సహజ సిద్ధంగా చిగురిస్తుంది.

- కొవ్వూరు



నేడు మొడులా



చిత్రాల చెట్టు మళ్లీ చిగురించాలి

చిత్రాల చెట్టు చిగురిస్తే.. సంతోషపడే వారిలో నేను ప్రథముడిని. గోదావరి పరీవాహక ప్రాంతాల్లో తీసిన 22 చిత్రాల్లో 18 సినిమాల్లో ఏదో ఒకచోట ఈ చెట్టు సీన్ ఉంటుంది. హీరో కృష్ణ నటించిన పాడిపంటలు సినిమాతో ఈ చెట్టు ఫేమస్ అయ్యింది. కె.విశ్వనాథ్ వంటి ఎందరో దర్శకులు చిత్రాలచెట్టు వద్ద ఎన్నో సినిమాలను చిత్రీకరించారు. నా ప్రతి సినిమాలో ఈ చెట్టు వద్ద ఒక్క సీన్ అయినా తప్పనిసరిగా ఉంటుంది. నా సినిమాలే కాదు నా కథలు, నవలల్లో కూడా ఉంటుంది. గోకులంలో రాధ అని నవల రాశా. ఆ నవలలో ప్రధానమైన బ్యాగ్రౌండ్ ఈ చెట్టు, కుమారదేవం గ్రామమే. గోదారితో ఎంత అనుబంధం ఉందో ఈ చెట్టుతో అంతే అనుబంధం ఉంది. గత నాలుగు రోజులుగా ఈ చెట్టు గురించి ఎక్కడెక్కడి నుంచో సుమారు 2 వేలు మెసేజ్‌లు వచ్చాయంటే నమ్ముతారా అన్నారు. ఈ చిత్రాల చెట్టు తప్పనిసరిగా చిగురించాలి. నేను మరలా ఎక్కువ సీన్లు ఈ చెట్టు వద్ద చిత్రీకరించాలి.

- వంశీ, సినీదర్శకుడు

వయ్యారి..గోదారమ్మ..

'వేదంలా ఘోషించే గోదావరి' అంటూ ఆరుద్ర రాజమహేంద్రి చారిత్రక వైభవాన్ని కళ్ల ముందుకు తీసుకొచ్చినా, వయ్యారీ గోదారమ్మ ఒళ్లంతా ఎందుకమ్మా కలవరం అంటూ వేటూరి కలం నుంచి హొయలు జాలువారినా, పిలిచే గోదారొడ్డు అంటూ శ్రీశ్రీ రాసినా, ఉరకలై గోదావరి అని ఇళయరాజా స్వర ప్రయోగాలు చేసినా, వెల్లువొచ్చి గోదారమ్మ ఎల్లాకిల్లా పడ్డాదమ్మా అనే వేటూరి రచన ఇప్పటికీ వరవళ్లు తొక్కుతున్నా.. అన్నిటికీ ముడిసరుకు గోదావరి. కవుల కలాలను ఉరకలెత్తించింది. వంశీ, విశ్వనాథ్ వంటి ఎందరో దిగ్గజ దర్శకుల చిత్రాల్లో గోదావరి గలగలలు కనబడాల్సిందే. గోదావరి ఒడ్డున సినిమా తీస్తే చెట్టూ.. పుట్టా.. గట్టూ ఇలా కంటికి కనిపించేవన్నీ సహజ సెట్టింగులే. 1952లో 'మరదలు పెళ్లి' సినిమాలో శ్రీశ్రీ రాసిన 'పిలిచే గోదారొడ్డు నోరూరించే బందరు లడ్డు' అంటూ సాగే పాటలో తొలిసారిగా గోదావరి ప్రస్తావన వినిపించిందని చెబుతారు. తర్వాత దాదాపుగా ప్రతీ సినీ కవి కలం కూడా గోదావరి అలలపై ఓలలాడింది.. ఆడుతూనే ఉంది. మూగమనసులు చిత్రంలో ఆరుద్ర రాసిన 'గోదారి గట్టుందీ.. గట్టుమీద చెట్టుందీ' అనే పాట వినని శ్రోత ఉండరంటే అతిశయోక్తి కాదేమో. ఉరకలై గోదావరి, వెన్నెల్లో గోదారి అందం, బద్దరగిరి రామయ్య పాదాలు కడగంగ పరవళ్లు తొక్కింది గోదారి గంగ, గోదావరి పైయ్యెద.. అంటూ ఎన్నో వందల పాటలకు ఆనాటి నుంచీ గోదారమ్మ ఆలంబన అయ్యింది. ఏటయ్యింది గోదారమ్మ, గలగల పారుతున్న గోదారిలా, గోదారి రేవులోన రాదారి నావలోన.. ఇలా ఎన్నో గీతాలు తెలిసినవే. - రాజమహేంద్రవరం

సినిమాలకు ఐలాండ్



ఐ.పోలవరం, ఆగస్టు 10 : చుట్టూ గోదావరి మధ్య దీవిలా ఉండే ఐలాండ్ ప్రాంతాలు పలు సినిమా షూటింగ్‌లకు వేదికగా నిలిచాయి. మండలంలోని ఎదురులంక, మురమళ్ల, ఐ.పోలవరం, అన్నంపల్లి అక్విడెక్టు, గోదావరి ఏటిగట్టు ప్రాంతాల్లో తరచు సినిమా షూటింగ్‌లు జరుగుతుంటాయి. దాసరి నారాయణరావు దర్శకత్వంలో కొండవీటి సింహాసనం షూటింగ్ ఎదుర్లంక ప్రాంతాల్లో 15 రోజులు చిత్రీకరించారు. కొండవీటి సింహాసనం ఇక్కడే చిత్రీకరించారు. ఈ సినిమాకు అవసరమైన రావిచెట్టు మొదలు (ధర్మాసనం), దాసరి నారాయణరావు విగ్రహాన్ని ముమ్మిడివరం మండలం గాడిలంకకు చెందిన ప్రముఖ శిల్పి పెద్దిరెడ్డి వెంకటకృష్ణ మాధవరావు రూపొందించారు. రవితేజ, శ్రీయ జంటగా భగీరథ షూటింగ్ ఐలాండ్‌లో జరిగింది. ఆక్సిజన్ సినిమా చిత్రీకరణ అన్నంపల్లి అక్విడెక్టు వద్ద జరిగింది.

కోనసీమ అందాల్లో సినిమా..

పి.గన్నవరం, ఆగస్టు10: కోనసీమ అందాలంటే సినిమా షూటింగ్‌లకు నెలవు. పి.గన్నవరం మండలం పాత అక్విడెక్టుపై కాల్వతొట్టెతో కలిసి ఉండడంతో పాటు గోదావరి అందాలు తోడవడంతో అప్పట్లో పలు పాత సినిమాలకు పాటలు చిత్రీకరించేవారు. శోభన్‌బాబు, వాణిశ్రీ నటించిన 'జీవనజ్యోతి'లో చిన్నిహో చిన్ని..పాట చిత్రీకరణలో కొంతభాగం సమీప పరిసరాలతో పాటు పాత అక్విడెక్టుపై చిత్రీకరించారు. 'సరిగమలు' చిత్రంలో స్వరరాగ గంగా ప్రవాహమే పాటను పాత అక్విడెక్టు కాల్వతొట్టెపై నడిచివస్తున్న హీరో వినీత్,సహనటుడు సోమయాజులుపై చిత్రీకరించారు. ఇలా చెప్పుకుంటూపోతే అలనాటి సినిమాల్లో పలు సన్నివేశాలు, పాటలను తెరకెక్కించారు. ఈనెల 9న విడుదలైన 'కమిటీ కుర్రోళ్లు' సినిమాలో జాతర, కాల్వలో పడిపోవడం తదితర సన్నివేశాలను దర్శకుడు వంశీ లాకులో చిత్రీకరించారు. ఈ సినిమా లంకల గన్నవరం గ్రామంలో కూడా ఎక్కువశాతం షూటింగ్ జరుపుకుంది.

చెట్టూ..గట్టుపై సినిమాలెన్నో..

- అందమైన లొకేషన్లకు కేరాఫ్ అడ్రస్
- గోదావరి తీరంతో 'సినీ' బంధం



లొల్ల లాకులు.. సెంటిమెంట్

ఆత్రేయపురం, ఆగస్టు 10: సినిమా సన్నివేశాలకు సెంటిమెంటు ఆత్రేయపురం లాకులు.. సెంట్రల్ డెల్టాకు ఆయువుపట్టుగా ఉన్న లొల్ల లాకులు, జంటలాకుల వద్ద ఎన్నో సన్నివేశాలు చిత్రీకరించారు. ఇక్కడ సన్నివేశాలు చిత్రీకరిస్తే సినిమా హిట్‌కొడతారనే దర్శక నిర్మాతల నమ్మకం. చిన్న సన్నివేశమైన ఈ ప్రాంతంలో చిత్రీకరిస్తారు. జీవితనౌక, పాడిపంటలు, సాక్షి, నీడలేని ఆడది, పల్నాటి పౌరుషం, అందాల రాముడు, సీతారామయ్యగారి మనవరాలు, మాధవయ్యగారి మనవడు, సింధూరం వంటి ఎన్నెన్నో చిత్రాలు ఇక్కడ చిత్రీకరించినవే. ఈవీవీ సత్యనారాయణ రూపొందించిన చిత్రాల్లో చాలావరకు లొల్ల బ్యాంక్ కెనాల్ కాలువ వద్ద 70 ఏళ్ల చరిత్ర కలిగిన మామిడిచెట్టు వద్ద సన్నివేశాలు రూపొందించేవారు. జంటలాకుల వద్ద సినిమా పాటలు, బొబ్బర్లంకలోని పిచ్చుకలంక వద్ద చలన చిత్ర సన్నివేశాలను రూపొందించారు.



గన్నవరం అక్విడెక్ట్‌పై చిన్నిహో చిన్న పాట చిత్రీకరణలో వాణిశ్రీ(ఫైల్)

అన్నవరంలో చెట్టు.. మెట్టు!

అన్నవరం, ఆగస్టు 10: అన్నవరంలో సినిమా షూటింగ్‌లు కోకొల్లలుగా జరిగాయి. కానీ ఇక్కడ తీసిన ప్రతి చిత్రంలో ప్రధానంగా ఆలయం ముందు ఉన్న చెట్టు, పక్కనే ఉన్న గుడి మెట్లు కనిపించేలా షూట్ తప్పకుండా ఉంటుంది. కళాతపస్వి కె.విశ్వనాథ్ అన్నవరం ఆలయానికి సంబంధించి ఒక్క సీన్ అయినా తన చిత్రంలో ఉండేలా చూసేవారు. అలా ఆయన తెరకెక్కించి అవార్డుల పంట పండించిన శంకరాభరణం హిందీ, తెలుగు వెర్షన్‌లు, సూత్రధారులు, స్వాతికిరణం, శుభప్రదం తదితర చిత్రాలు అన్నవరం కొండపై చిత్రీకరణ జరుపుకున్నాయి.అల్లూరి సీతారామరాజు, నాయుడుగారి అబ్బాయి, గురుబ్రహ్మ, నిన్నే పెళ్లాడుతా, నువ్వే..నువ్వే, గీతాగోవిందం, ఖుషీ (కొత్తది) అన్నవరంలోనే చిత్రీకరించారు.ఈ చిత్రాలన్నింటిలోను రత్నగిరి అందాలతోపాటు పంపా హొయలు, మిస్సమ్మకొండలను చిత్రీకరించేవారు. తూర్పురాజగోపురం ఎదురుగా ఉండే రావి చెట్టును ప్రత్యేకంగా చిత్రీకరించేవారు. ఇది ఆలయ ఆవిర్భావం నుంచి ఉన్నట్టు తెలుస్తోంది. శంకరాభరణం నుంచి గీతగోవిందం వరకు అన్నవరం సత్యదేవుడి ఆలయ మెట్లను షూటింగ్ స్పాట్లుగా చిత్రీకరించారు.

హిట్ చిత్రాల నిలయం.. అంతర్వేది ఆలయం

అంతర్వేది, ఆగస్టు 10: దక్షిణ కాశీగా పేరొందిన అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం సినీ తారల అదృష్ట ఆలయం. ఎన్టీఆర్, కృష్ణ, శోభన్‌బాబు వంటి అగ్ర హీరోలు సైతం అంతర్వేది, గుడిమూల, సఖినేటిపల్లి పరిసర ప్రాంతాల్లో షూటింగులు నిర్వహించి ఈ ప్రాంతాన్ని ఎందరికో పరిచయం చేశారు. ప్రేమలో పావని కల్యాణ్, రుక్మిణి, రామరామకృష్ణకృష్ణ, ఆడాళ్లు మీకుజోహార్లు వంటి సినిమాల షూటింగ్‌లు గోదావరి తీరం, సముద్రతీరంలో చిత్రీకరించారు. గుడిమూల ఏడు మేడలుతో పాటు సఖినేటిపల్లి రేవు, దిండి రిసార్ట్స్, చించినాడ, మలికిపురం, రాజోలు ప్రాంతాల్లో గోదావరి గట్ల మీద ఎక్కువగా సినిమాల షూటింగ్‌లు జరిగాయి. అంతర్వేదిలో లైట్‌హౌస్, అన్నాచెల్లెలు గట్టు, బీచ్, ఏటి గట్టు, సరుగుడు, కొబ్బరి తోటలు, పాడి పంట వంటి లొకేషన్లు చిత్రీకరణకు అనువుగా ఉంటాయి. హిట్ చిత్రాల దర్శకుడు వీవీ వినాయక్ అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి పాదాల చెంత స్క్రిప్టు పూజలుచేసి అనంతరం ఆ చిత్రాల షూటింగులను ప్రారంభించేవారు.

పోలీస్ స్టేషన్ వద్ద పెట్రోల్ పోసుకుని

ఆత్మహత్యాయత్నం

- పరువుపోయిందనే ఘాతుకం
- పరిస్థితి విషమం - కాకినాడ తరలింపు



రాజమహేంద్రవరం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : పరువుపోయిందని ఒక వ్యక్తి రాజమహేంద్రవరంలోని త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద శనివారం సాయంత్రం ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన కలకలం రేపింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. లింగంపేటకు చెందిన షోలాపురి నాగ వర ప్రసాద్ సైకిల్‌కి ప్యాచ్‌లు వేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు.ఆయన భార్య ఇంటివద్ద టైలరింగ్ చేస్తారు. ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నాగళ్ల సూరిబాబు యాదవ్ నుంచి ప్రసాద్ తెలిసిన వారి ద్వారా రూ.20 వేలు అప్పు తీసుకున్నాడు. దఫదఫాలుగా అప్పు తీర్చగా ఇంకా కొంత మొత్తం బాకీ ఉన్నాడు.వాటి నిమిత్తం శనివారం సూరిబాబు యాదవ్ వచ్చి అప్పు కింద ప్రసాద్ ద్విచక్ర వాహనాన్ని తీసుకెళ్లాడు. ఆ తాళాలను ఇంట్లో పెట్టి బయటకు వెళ్లిపోయాడు.ప్రసాద్ వాళ్లింటికి వెళ్లి తాళాలు అడిగినా ఫలితం లేకపోవడంతో త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌కి వెళ్లాడు. ఆ సమయంలో ఏం జరిగిందో ఏమో కాని.. కాసేపటికి ఒంటిపై పెట్రోలు పోసుకొని నిప్పంటించుకున్నాడు. అక్కడివారు గమనించి మంటలు ఆర్పి వేసి రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. శరీరంపై సుమారు 80 శాతం కాలిన గాయాలయ్యాయి.ఆస్పత్రికి న్యాయమూర్తి చేరుకొని బాధితుడి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ అప్పారావు తెలిపారు. ప్రసాద్ స్టేషన్ లో కూర్చున్న తర్వాత ఫోన్‌లో ఎవరితోనో గట్టిగా మాట్లాడుతూ అరిచాడని తెలుస్తోంది.ఆ సమయంలో అతడి వద్ద పెట్రోలు బాటిల్ ఉన్నా ఎందుకు పోలీసులు గమనించలేకపోయారోననే ప్రశ్నకు సమాధానం కరువైంది. తన పరువుపోయిందనే మనస్తాపంతోనే ఆత్మహత్యకు ప్రయత్నించినట్టు బాధితుడు చెబుతున్నట్టు సమాచారం.

పిడింగొయ్యిలో భూకబ్జా యత్నం

- 4.08 ఎకరాల భూమి వివాదం
- విజయవాడ నుంచి వచ్చి గొడవ
- ఎక్స్‌కవేటర్‌తో భూమి చదును
- అడ్డుకున్న లేఅవుట్‌దారులు
- ఉద్రిక్తంగా మారిన పరిస్థితి
- చర్చించిన తహశీల్దార్
- రికార్డు తేవాలని ఆదేశం



వివాదానికి కారణమైన భూమి

భూమి వద్ద సాగుతున్న గొడవ

రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు 10 : రాజమహేంద్రవరం రూరల్ మండలంలోని పిడింగొయ్యి గ్రామంలో నాలుగెకరాల డీటీసీపీ అప్రూవల్ భూమికి తాము యజమానులమంటూ కొంత మంది విజయవాడ నుంచి వచ్చి జేసీబీలతో చదును చేసి కబ్జాకు యత్నించారు.ఈ ప్లాట్ల అసలు యజమానులకు విషయం తెలిసి అక్కడకు చేరుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.పిడింగొయ్యి గ్రామంలో సర్వేనెం 372/1, 374/2,3లో లే అవుట్ ఎల్‌పి నెం 49/87లో మొత్తం 4.08 ఎకరాల్లో 95 ప్లాట్లను 1987లో జనప్రియ డీటీసీపీ అప్రూవల్‌తో కొనుగోలు చేసుకున్నారు. వాటికి అప్పుడే రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. ఈ భూమిలో రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాలు, ఏలూరు, ఇతర గ్రామాలకు చెందిన వారు ఉన్నారు. అయితే ఎవరికి వారు వారి ప్లాట్ల సరిహద్దుల్లో సిమెంట్ స్తంభాలతో పెన్సింగ్‌లు ఏర్పాటు చేసుకున్నారు. ఈ భూమిని శుక్రవారం కొంతమంది విజయవాడ నుంచి వచ్చి జేసీబీలు పెట్టి చదును చేశారు. ఈ విషయం అసలు యజమానులకు తెలియడంతో శనివారం ఉదయం వారంతా పిడింగొయ్యిలోని తమ ప్లాట్ల వద్దకు వచ్చి అడ్డగించి వారితో గొడవకు దిగారు. 1987లోనే రిజిస్ట్రేషన్ చేయించుకున్న తమ భూమిని మీరెలా మీ భూమిగా స్వాధీనం చేసుకుని చదును చేస్తారని నిలదీశారు. దీంతో అసలు యజమానులు, విజయవాడ నుంచి వచ్చిన వారికి మధ్య పెద్దగొడవే జరిగింది. సమాచారం అందుకున్న బొమ్మూరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేశారు. ఇంతలో విషయం తెలుసుకున్న రూరల్ ఇన్‌చార్జి తహశీల్దార్ రమ్య సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలతో మాట్లాడారు. ఇది సర్వేచేసి తమకు అధికారులు అప్పగించారని విజయవాడ నుంచి వచ్చిన వారు అంటుంటే అసలు ఇక్కడ సర్వేనే ఇటీవల జరగలేదని సంబంధిత అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇరుపక్షాల డాక్యుమెంట్లను తనవద్దకు తీసుకువస్తే వాస్తవాలు బయటకు వస్తాయని అంత వరకు ఇక్కడ ల్యాండ్ స్కేపింగ్ పనులు నిలుపుదల చేయాలని రమ్య ఆదేశించారు. బాధితుల పక్షాన టీడీపీ రాజమహేంద్రవరం అధ్యక్షుడు రెడ్డి మణేశ్వరావు నిలిచారు. బాధితులకు కూటమి ప్రభుత్వం న్యాయం చేస్తుందని స్పష్టం చేశారు. టీసీపీ అప్రూవల్ ల్యాండ్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు ఉండగా అగ్రికల్చర్ ల్యాండ్‌గా మరొకరి వద్ద డ్యాక్యుమెంట్లు ఎలాపుట్టుకు వచ్చాయనే విమర్శలు వ్యక్తమౌతున్నాయి. ఈ లేవుట్‌ను 2019లో అప్పటి వైసీపీ ప్రభుత్వంలో కొందరు కలిసి అగ్రికల్చర్ ల్యాండ్‌గా వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేసుకున్నారు. దీని వెనుక కొంత మంది అధికారుల ప్రాత ఉంది.

ఇది చాలా దారుణం



జనప్రియ పేజ్-2లో డిటీసీపీ అప్రూవల్‌లో ప్లాట్ కొన్నాం. దానికి పెన్సింగ్ వేసుకుని 1987 నుంచి ప్రొటెక్ట్ చేసుకుంటున్నాం. ఇప్పుడు ఎవరో వచ్చి ఈ భూమి అగ్రికల్చర్ ల్యాండ్ దినిని తాము కొన్నామని సరిహద్దులు చెరిపేసి హస్తగతం చేసుకోవాలని దౌర్జన్యంగా ప్రవేశించడం చాలా దారుణం. - నెక్కంటి సత్యనారాయణ



రాజమహేంద్రవరం జీజీహెచ్ ఎదుట ధర్నా చేస్తున్న సెక్యూరిటీ సిబ్బంది

జీతాల కోసం జీజీహెచ్ సెక్యూరిటీ సిబ్బంది ధర్నా

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 10 : జీతాల కోసం రాజమహేంద్రవరం జీజీహెచ్ సెక్యూరిటీ సిబ్బంది రోడ్డెక్కారు. మూడు నెలలుగా జీతాలు చెల్లించకపోతే తమ కుటుంబాలు ఎలా గడుస్తాయంటూ శనివారం నిరసనకు దిగారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్) ఎదుట ధర్నా చేపట్టారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు తాటిపాక మధు మాట్లాడుతూ పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని లేకుంటే సెక్యూరిటీ సిబ్బంది అందరూ ఈనెల 12వ తేదీ నుంచి సమ్మెకు దిగుతారన్నారు. జీతాల కోసం కాంట్రాక్టర్‌ను, ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను కలసి మొరపెట్టుకున్నా ఫలితం లేదన్నారు. పెండింగ్ జీతాలు తక్షణమే చెల్లించాలని, పీఎఫ్ అకౌంట్లు అందరికీ ఇవ్వాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని నినాదాలు చేశారు.కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు వి.కొండలరావు, యూనియన్ అధ్యక్షుడు ఎం.ప్రసాదరావు, కుమార్, పెద్దబ్బాయి, మోహన్, నరేష్, సూరిబాబు, భాగ్యలక్ష్మి, సుశీల, అనంతలక్ష్మి, విజయలక్ష్మి, మీనాక్షి, గంగారత్నం, వరలక్ష్మి, శ్రీనివాస్, శివ పాల్గొన్నారు.



యూటీఎఫ్ జెండా విష్కరిస్తున్న బాలయ్య

ఘనంగా యూటీఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలు

నల్లజర్ల, ఆగస్టు 10: ఐక్య ఉపాధ్యాయ సంఘం(యూటీఎఫ్) స్థాపించి 50 వసంతాలు పూర్తవుతున్న సందర్భంగా శనివారం నల్లజర్ల హైస్కూల్‌లో స్వర్ణోత్సవ సంబరాలు నిర్వహించారు. ముందుగా సీనియర్ నాయకుడు ఎస్.బాలయ్య యూటీఎఫ్ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి బీవీ సత్యం మాట్లాడుతూ ఎందరో నాయకుల కృషి ఫలితమే నేడు ఉపాధ్యాయులు పొందుతున్న సౌకర్యాలు అన్నారు. కార్యక్రమంలో ఎంగంగరాజు, ఎస్ఎం ఆలీసాహెబ్,మండల అధ్యక్షుడు ఎస్ఎ్ ఆలీ అహ్మద్, బి.కిషోర్, నల్లజర్ల భవాని, జిల్లా కార్యదర్శి సీహెచ్ మనోహర్‌కుమార్ పాల్గొన్నారు.



ఉండ్రాజవరంలో యూటీఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఉండ్రాజవరం: ఉండ్రాజవరం హైస్కూలులో యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ ఆవిర్భావం నుంచి ఇంతవరకు యూటీఎఫ్ కార్యకర్తలపట్ల చేసిన సేవలను వివరించారు. యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా సహాయ అధ్యక్షులు ఐ.రాంబాబు, మండలశాఖ గౌరవాధ్యక్షుడు ఎస్.లక్ష్మీనారాయణ, మండలశాఖ సహాయాధ్యక్షుడు ఎం.వెంకటలక్ష్మి, మండల ప్రధాన కార్యదర్శి బి.రామారావు, యూటీఎఫ్ నాయకులు ఎస్‌కె మీరాసాహెబ్, బి.శ్రీనివాస్, హైస్కూలు ప్రధానోపాధ్యాయులు కె.మాణిక్యాలరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అన్యాయంగా విధుల్లోంచి తొలగించారు

● ఎస్సీ సెల్ నాయకుడు పిట్టా శ్రీను



ఎక్సైజ్ అధికారితో మాట్లాడుతున్న ఎస్సీ నాయకుడు పిట్టా శ్రీను

తాళ్ళపూడి, ఆగస్టు 10 : తాళ్ళపూడి గ్రామంలోని ప్రభుత్వ మద్యం దుకాణంలో పనిచేసి సిబ్బందిని అన్యాయంగా తొలగించారని వారిని వెంటనే విధులలోకి తీసుకోవాలని ఎస్సీ నాయకుడు పిట్టా శ్రీను శనివారం ఎక్సైజ్ అధికారులను కోరారు. స్థానికంగా మద్యం దుకాణంలో పనిచేసే యువకులు అశోక్, భాను, సతీష్‌లు మాట్లాడుతూ మాకింకా సెప్టెంబరు నెల వరకూ అగ్రిమెంటు ఉందని షార్టేజీ ఉన్న కొవ్వూరు షాపుకు బదిలీ చేసి ఇష్టం లేకుంటే రాజీనామా చేయమని బలవంతం చేశారని తెలిపారు. ఈ మేరకు తా ళ్ళపూడి మద్యం దుకాణంవద్ద ఎక్సైజ్ ఎస్ఐ లక్ష్మణస్వామి మాట్లాడుతూ తా ళ్ళపూడి మద్యం దుకాణంలో పనిచేసే ముగ్గురు యువకులను వేరేచోటుకు బది లీ చేయడంతో వారు వెళ్లమని అవసరమైతే రాజీనామా చేస్తామని తెల పడంతో వారిని అధికారుల ఆదేశాలతో తొలగించి వేరేవారిని నియమించామని తెలిపారు.

ఘనంగా సుబ్బరాయచౌదరి పుట్టినరోజు

● వృద్ధాశ్రమాలు, ఆసుపత్రిలో పేదలకు అన్నదానం



జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరికి జ్ఞాపికను అందిస్తున్న ద్విసభ్య కమిటీ సభ్యుడు కంఠమణి రామకృష్ణారావు, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, ఆగస్టు 10: కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి 63వ జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. అభిమానులు, కార్యకర్తల మధ్య కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ద్విసభ్య కమిటీ సభ్యుడు కంటమణి రామకృష్ణారావు, పార్లమెంటు కార్యాలయ కార్యదర్శి పొట్రు శ్రీనివాసరావులు గజమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వాత్సల్య వృద్ధాశ్రమంలో వృద్ధులకు, మదర్‌థెరిస్సా హోంలోని వీధి బాలలకు, ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు, అంధుల పాఠశాలలో దివ్యాంగులకు అన్నదానం చేశారు. కొవ్వూరు బస్టాండ్ సెంటర్‌లో అన్నా క్యాంటిన్ వద్ద పార్లమెంటు కార్యాలయ కార్యదర్శి పొట్రు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 300 మంది పేదలకు అన్నదానం చేశారు. సుబ్బరాయచౌదరికి శుభాకాంక్షలు తెలిపిన వారిలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణారావు, పొట్రు శ్రీనివాసరావు, యనమదల సుబ్రహ్మణ్యం, జొన్నలగడ్డ శ్రీనివాసరావు, మద్దిపట్ల శివరామకృష్ణ, సూర్యదేవర రంజిత్, దాయన రామకృష్ణ, ఎంపీపీ కాకర్ల నారాయుడు, మాజీ ఎమ్మెల్యే టి.వి.రామారావు, బర్ల శ్రీనివాస్, మద్దుకూరి సురేష్, పాలడుగుల రమేష్, మాదిరెడ్డి సతీష్, బొబ్బిలి షేర్‌రాజు, జి.జి.చలం, కొవ్వూరు పట్టణ, మండలం, తాళ్లపూడి, చాగల్లుకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల కట్టడికి ప్రత్యేక వైద్య శిబిరాలు

నల్లజర్ల, ఆగస్టు 10 : ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యగా గ్రామ గ్రామాన ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు నల్లజర్ల పీహెచ్‌సీ డాక్టర్ తెల్లం గంగాధర్ పేర్కొన్నారు. శనివారం ప్రకాశరావుపాలెంలో ఉపసర్పంచ్ యద్దనపూడి బ్రహ్మరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటుచేశారు.67 మందికి వైద్యసేవలు అందించారు. జ్వరపీడితులకు అక్కడే రక్త నమూనాలు సేకరించి ల్యాబ్‌కి పంపించారు. ఏ ఒక్కరు అనారోగ్యంతో ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి అనవసరంగా వేలాది రూపాయలు ఖర్చు చేయవద్దన్నారు. ఉప సర్పంచ్ యద్దనపూడి బ్రహ్మరాజు మాట్లాడుతూ వైద్య ఉద్యోగులందరూ కలిసికట్టుగా గ్రామీణా ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జాన్ విక్టర్, వైద్య ఉద్యోగుల సంఘం నాయకులు జీ.వి.వి ప్రసాద్ పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



వెంకటేశ్వరస్వామి ఆలయంలో కూచిపూడి నృత్య ప్రదర్శన దృశ్యం

దేవరపల్లి, ఆగస్టు 10: దేవరపల్లిలో శ్రీదేవి, భూదేవి సమేత వెంక టేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తులతో పోటెత్తారు. శ్రావణ మాసం సందర్భంగా స్వామి,అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామి వారికి విశేష అలంకరణ, అమ్మవార్లకు కుంకుమపూజలు నిర్వహించారు. సాయంత్రం వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో సత్యశ్రావణి నృత్యానికేతన్ రాజమండ్రి వారిచే విద్యార్థులతో కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. వేలాది మంది భక్తులు నృత్యప్రదర్శన తిలకించారు. అనంతరం ఆలయ కమిటీ ఛైర్మన్ అంబటి శ్రీనివాసరావు నృత్యాకళాకారిణి సత్యశ్రావణి ఉత్తమ ప్రదర్శనలు నిర్వహించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కూటమి ప్రభుత్వ నిర్ణయం అభినందనీయం

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చంటిబాబు

దివాన్‌చెరువు, ఆగస్టు10 : ఎంతమంది పిల్లలు ఉన్నా స్థానికసంస్థల ఎన్నికలలో పోటీచేసేందుకు అర్హులంటూ కూటమి రాష్ట్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగిశెట్టి చంటిబాబు అన్నారు. శనివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. చంద్రబాబు సారథ్యంలోని ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంవల్ల ఎక్కువమంది పిల్లలు ఉన్నవారు స్థానిక సంస్థల ఎన్నికలకు దూరంగా ఉండాల్సిన అవసరం ఉండదని చంటిబాబు చెప్పారు.

ఇసుక కొరత రానివ్వద్దు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రవీంద్ర. చిత్రంలో మరో మంత్రి దుర్గేష్

● అందరికీ అందుబాటులో ఉచిత ఇసుక
● లారీలకు వెయిటింగ్ లేకుండా చర్యలు
● వారంలో డీసిల్టేషన్ ద్వారా ఇసుక
● బోట్స్‌మన్ సొసైటీలకు అనుమతి
● రాఘవ కనస్ట్రక్షన్ ద్వారా డ్రెడ్జింగ్. మరింత ఇసుక అందుబాటులోకి
● అక్టోబరు 15 నుంచి ఓపెన్ రీచ్‌లకు అనుమతి
● ఉచిత ఇసుక విధానంపై మంత్రులు కొల్లు రవీంద్ర, దుర్గేష్ సమీక్ష

రాజమహేంద్రవరం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): 'ఇసుక కొరత రానివ్వద్దు.... ప్రజల కోసం సీఎం చంద్రబాబునాయుడు ఎంతో ఆలోచించి ఉచిత ఇసుక విధానాన్ని అమల్లోకి తెచ్చారు. అధికారులు, శాఖల మధ్య సమన్వయ లోపంతో ఇసుక కొరత కొంతమేర కనిపిస్తోంది. ఈ సమస్య వెంటనే పరిష్కా రం' కావాలి అని ఎక్సైజ్, మైనింగ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. శనివారం వారు తూర్పు గోదావరి జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రశాంతి అధ్వర్యంలో ఉచిత ఇసుక సరఫరాపై సమీక్షించారు. చివరి లబ్ధిదారుడికి కూడా ఇసుక అందుబాటులో ఉండాల న్నారు. రాష్ట్రవ్యాప్తంగా 42 లక్షలు, డీసిల్టేషన్ పాయింట్లలో 71లక్షల టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న ఉచిత ఇసుక విధానంపై ప్రజల్లో కొన్ని అపోహలు ఉన్నాయని.. వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. గత ప్రభుత్వంలో దెబ్బతిన్న నిర్మాణ రంగం ఇప్పుడిప్పుడే కోలుకుంటోందన్నారు. లారీ అసోసియేషన్ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని.. ఒకట్రెండు నెలలు వేచి ఉంటే మంచి ప్రయోజనం చేకూరేలా సానుకూల నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రభుత్వం తీసుకున్న లోడింగ్, పరిపాలనా పరమైన చార్జీలు, సీనరేజ్ వంటివి చెల్లించి ఉచితంగా ఇసుక పొందవచ్చని చెప్పారు. బోట్స్‌మన్ సొసైటీలద్వారా డీసిల్టేషన్ ఇసుకను వారంలో అందుబాటులోకి తెస్తామ న్నారు. అక్టోబరు 15 నుంచి ఓపెన్ రీచ్‌లు ప్రారంభమవుతాయన్నారు. ఏఏ రీచ్‌ల్లో ఎంత ఇసుక ఉందో తెలియజేస్తామని, దానికి ట్రాన్స్‌పోర్టర్లు సహకరించాలన్నారు. సచివాలయం నుంచి ఇసుక బుక్ చేసుకోవచ్చని.. ఎవరైనా ఇసుకను తప్పుదారి పట్టిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఉచిత ఇసుక విధానం కచ్చితంగా అమలు కావల్సిందేనన్నారు. స్టాక్ పాయింట్ల వద్ద నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. సోమవారం నుంచి 8 రీచ్‌లు అందుబాటులోకి వస్తాయని, మరో 11 రీచ్‌లను రాఘవ కనస్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో త్వరలో అందుబాటులోకి తెస్తామన్నారు. మైనింగ్ శాఖను పూర్తిగా ప్రక్షాళన చేస్తామన్నారు. కొన్ని అక్రమాలు జరుగుతున్నట్టు ప్రచారం ఉన్నా సెబ్ అధికారులు ఎందుకు నిర్లక్ష్యంగా ఉంటున్నారని ప్రశ్నించారు. కచ్చితంగా చర్యలు తీసుకోవాలంటూ అక్షింతలు వేశారు. ఏడాదికి 3 కోట్ల టన్నుల ఇసుక అవసరం ఉందని.... ప్రస్తుత సీజన్లో సుమారు కోటి టన్నుల ఇసుకను అందుబాటులో ఉంచామన్నారు. పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ వాస్తవ పరిస్థితికి అనుగుణంగా ఇసుక లభ్యతపై చర్యలు తీసుకుంటున్నామన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మంచి ఆలోచనతో ఉచిత ఇసుక విధానం అమల్లోకి తెచ్చారన్నారు. కేవలం ఆపరేషన్ ఖర్చులు మాత్రమే వసూలు చేసి ఇసుక ఇస్తున్నామన్నారు. త్వరలో పూర్తి స్థాయిలో ఉచిత ఇసుక విధానాలు అమలు చేస్తామని చెప్పారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ ఇసుక రవాణాను సమర్థవంతంగా అమలు చేయ దానికి మూడు బృందాలతో రిజిస్ట్రేషన్, లోడింగ్, విజిలెన్స్ ప్రక్రియలను పర్యవే క్షిస్తున్నట్టు చెప్పారు. డిప్యూటీ తహసీల్దారు ఇసుక రీచ్‌మేనేజరుగా, ఇన్‌చార్జి గా వ్యవహరిస్తున్నారని తెలిపారు. రీచ్‌ల వద్ద ఇసుక రవాణాకు ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకే అనుమతిస్తామన్నారు. జిల్లా డివిజన్, మండల స్థాయిల్లో కంట్రోలు రూమ్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. అనధికార ఇసుక నిల్వలను గుర్తించి రూ.8.82 లక్షల అపరాధ రుసుం వసూలు చేశామన్నారు. 14 కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేశామన్నారు. ఇరిగేషన్ ద్వారా 17 డీసిల్టేషన్ పాయింట్లు గుర్తించగా వాటి ద్వారా 1.83 లక్షల టన్నుల లభిస్తోందన్నారు. బోట్స్‌మన్ సొసైటీల నిర్వహణకు టెండర్లు పిలవా లని జిల్లాస్థాయి కమిటీలో నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ ప్రజల్లో ఉచిత ఇసుక రవాణా, లోడింగ్, తదితర అంశాల్లో స్పష్టత లేకపోవడం వల్ల అపోహలు ఉన్నాయన్నారు. వాహన రవాణా ఖర్చుల విషయంలో కూడా స్థిరమైన ధర ఉండాలని చెప్పారు. పట్టా భూముల్లో ఇసుక విధానంపై మార్గదర్శకాల జారీలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోలవరం వరకు గోదావరి గట్టుకు రెండువైపులా ర్యాంపుల్లో స్టాక్ పాయింట్లు పెడితే రవాణా ఖర్చులు తగ్గుతాయని సూచించారు. రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ వినియోగదారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఇసుక సరఫరా చేయాలన్నారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ రాజానగరం నియోజకవర్గంలో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా ప్రభుత్వ భవనాల నిర్మాణానికి ఇసుక కొరత ఏర్పడిందని, వెంటనే అమల్లోకి తెస్తే ప్రజలకు కూడా మేలు జరుగుతుందన్నారు. తాము ఎదుర్కొంటున్నామని సమస్యలను పరిష్కరించాలని లారీ అసోసియేషన్ నాయకులు, బోట్స్‌మన్ సొసైటీ నిర్వాహకులు మంత్రులకు, కలెక్టర్‌కు విన్నవించారు. లారీ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ టోల్‌గేట్ ఫీజు, గ్రీన్ ట్యాక్స్ వంటివాటి పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. సమావేశంలో ఎస్పీ డి.నరసింహ కిశోర్, ఇన్‌చార్జి జేసీ, డీఆర్వో జి.నరసింహులు, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, ఆర్డీవో కేఎల్ జ్యోతి, ఆర్వీ రమణనాయక్, ఇరిగేషన్ సీఈ పుల్లారావు, ఎస్ఈ శ్రీనివాసరావు, మైన్స్ ఏడీ డి. సుబ్రహ్మణ్యం, డీఎల్ఎస్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నిడదవోలు నియోజకవర్గ అభివృద్ధే నా లక్ష్యం

● అధికారులతో సమీక్షా సమావేశంలో మంత్రి దుర్గేష్



నియోజకవర్గస్థాయి అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు, ఆగస్టు 10: నిడదవోలు నియోజకవర్గాన్ని సర్వతో ముఖంగా అభివృద్ధి చేయాలన్నది నా లక్ష్యమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. శనివారం సాయంత్రం నిడదవోలు పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో పలు శాఖల అధికార్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ ఇప్పటివరకు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు ఇక మీదట జరగాల్సిన అభివృద్ధి పనులపై ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. అధికార్లు, ప్రజాప్రతినిధుల సహకారంతోనే నియోజకవర్గా న్ని అభివృద్ధి పథంలో నిలుపుతామన్నారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, పంచాయ తీరాజ్ శాఖా మంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో నిడదవోలు నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి రూ.11కోట్లు కోట్ల మంజూరయ్యాయని వీటితో పనులు ప్రారంభిస్తామన్నారు. ఆగస్టు 15న జాతీయ భావం పెంపొందేలా గ్రామాల్లోను జాతీయ జెండా ఎగుర వేయాలని అన్నారు. అనంతరం పంగిడి రోడ్డులో ఉన్న అన్నా క్యాంటిన్ పనులను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జేపి ఝాన్సీ, మున్సిపల్ కమిషనర్ రామ్‌భూపాల్, రూరల్‌వాటర్ సప్లయ్, పంచాయతీరాజ్, హౌసింగ్, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ పేరు ఎత్తే అర్హత వైసీపీ నాయకులకు లేదు

● కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, ఆగస్టు 10: సంక్షేమ పథకాలకు అంబేడ్కర్ పేరును తొలగించిన జగన్మోహనరెడ్డికి అంబేడ్కర్ పేరు ఎత్తే అర్హత లేదని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో శనివారం పాత్రికేయుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలో సమానత్వం సాధించడమే లక్ష్యంగా ప్రజా పాలన సాగాలని అంబేడ్కర్ సూచించారన్నారు. ఆనాడు భారత రాజ్యాంగం స్థాపించడంలోగానీ, బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి ప్రత్యేక హక్కులు, రిజర్వేషన్లు కావాలని పోరాడిన మహోన్నత వ్యక్తి అన్నారు. మేనమామగా ఉంటానని చెప్పి గద్దెనెక్కిన ఐదేళ్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీలను అణగదొక్కారన్నారు. డాక్టర్ సుధాకర్ నుంచి డ్రైవర్ సుబ్రహ్మణ్యం వరకు హత్యలు చేయలేదా అన్నారు. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం దళితులు, బలహీనవర్గాల ప్రజలకోసం ప్రవేశపెట్టిన 27 సంక్షేమ పథకాలను, అంబేడ్కర్ విదేశీవిద్యను రద్దు చేశారని, సబ్ నిధులు రూ.40వేల కోట్లను దారి మళ్లించారన్నారు. ఎస్సీ, బీసీలు అణగారిన వర్గాల గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. అమరావతి రాజధానిలో 30 ఎకరాలలో 125 ఎకరాల అంబేడ్కర్ విగ్రహం, లైబ్రరీ ఏర్పాటుచేసి స్మృతివనంగా తీర్చిదిద్దాలని చంద్రబాబు తీర్మానిస్తే అమరావతిని నాశనం చేసింది నువ్వు కాదా అని ప్రశ్నించారు. వైసిపి ప్రభుత్వం ఏర్పాటుచేసిన అంబేడ్కర్ విగ్రహానికి మొదట్లో 170 కోట్లు ప్రతిపాదించి పూర్తయ్యేసరికి రూ.404కోట్లుకి తీసుకువెళ్లారు. రూ. 258 కోట్లు ఎక్కడికి వెళ్లాయి జగన్మోహన రెడ్డి చెప్పాలన్నారు. గత ఐదేళ్లలో 180 మంది దళితులను హత్య చేయలేదా అన్నారు. ఆడపిల్లలకు రక్షణ లేకుండా చేశారన్నారు. ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ తీస్తానని, మెగా డీఎస్సీ, నిరుద్యోగభృతి అని ఏదీ చేయలేదన్నారు. కార్యక్రమంలో మద్దిపట్ల శివరామకృష్ణ, నాదెళ్ళ శ్రీరామ్, మద్దిపట్ల సురేష్, ఎ. రాజేంద్రప్రసాద్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహాలను తాకే అర్హత వైసీపీకి లేదు

● ఎమ్మెల్యే మద్దిపాటి

నల్లజర్ల, ఆగస్టు 10 : అంబేడ్కర్ విగ్రహాలను తాకే అర్హత వైసీపీ నేతలకు లేదని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఐదేళ్ల వైసీపీ పాలనతో తీరని అవమానం జరిగిందన్నారు. అంబేడ్కర్ రాజ్యాంగాన్ని చెత్తబుట్టలో పడేసి రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేసిన ఫ్యూడలిస్టు జగన్ అని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సమాన అవకాశాలు కల్పిస్తూ ప్రతిఒక్కరినీ ప్రోత్సహించాలని చెప్పిన డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ మాటలను గత ఐదేళ్లలో వైసీపీ నేతలు ఒక్క రోజైనా అనుసరించలేదన్నారు. రూ.170కోట్లతో చేపట్టిన అంబేడ్కర్ విగ్రహం రూ.404కోట్లకు చేరిందన్నారు. ఇందులో 258 కోట్లు వైసీపీ నేతలు స్వాహాచేసిన ఆరోపణలు ఉన్నాయన్నారు.

సమస్త ప్రాణకోటికి నీరే జీవనాధారం

● ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు



పెద్దాపురంలో ఉచిత శుద్ధి జలాల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు

గోపాలపురం, ఆగస్టు 10: సమస్త ప్రాణకోటికి నీరే జీవనాధారం అని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. మండలంలోని వేల చింతలగూ డెంలో ఉపాధిహామీ, ఆరోగ్యశాఖ సంయుక్త నిధులు రూ.20.80లక్షలతో నిర్మిం చిన విలేజ్‌హెల్త్ సెంటర్‌ను అదేవిధంగా పెద్దాపురంలోని కొర్లపాటి రామారావు, పుష్పవతి దంపతుల కుమారుడు వీరకృష్ణా జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు రూ.8లక్షలతో నిర్మించిన శుద్ధిజలాల ఉచితనీటి సరఫరా కేంద్రాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వార్థంతో పేరుకుపోయిన నేటి సమాజంలో ఇంకా సమాజ శ్రేయస్సుకోరి ప్రజల దాహార్తి తీర్చేందుకు స్వచ్ఛందంగా దాతలు నీటిశుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అదేవిధంగా దాతల స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని స్వచ్ఛందంగా సమాజ శ్రేయస్సుకోరి సంపాదిం చిన సొమ్మును కొంతైనా సమాజానికి ఖర్చు చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. 2014-2019లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపుమేరకు గ్రామ గ్రామాన ఎన్‌టీఆర్ సుజల శ్రవంతి పేరుతో రూ.2కే 20లీటర్ల శుద్ధి జలాలను అందించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో శుద్ధి జలాలను ప్రజలకు అందించకపోగా ఉన్న కేంద్రాలను నిలిపివేసే దుస్థితి నెలకొందన్నారు. గోపాలపురం నియోజకవర్గంలో గత కొన్ని సంవత్సరాలుగా నిర్విరామంగా ప్రజల దాహార్తి తీర్చేందుకు కొనసాగుతున్న సత్యసాయి మంచినీటి సరఫరా కేంద్రాన్ని సైతం వైసీపీ ప్రభుత్వంలో నిలిపివేసిన దుస్థితి ప్రజలు ఇంకా మర్చిపోలేద న్నారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌ఛార్జ్ సువర్ణరాజు, ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ, ఎంపీటీసీ కాకులపాటి లలిత, మండల టీడీపీ అధ్యక్ష కార్యదర్శులు రొంగలి సత్యనారాయణ, వడ్లపూడి రమేష్, వేలచింతలగూడెం గ్రామ కమిటీ అధ్యక్షులు ఇల్లూరి రాంబాబు, టీడీపీ సీనియర్ నాయకులు కొర్లపాటి రాము, కొర్లపాటి అన్నవరం, జగదీష్, గంటా మధుకృష్ణ, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కాకర్ల రామతులసి, మాజీ ఎంపీటీసీ కూనపం ప్రసాద్‌బాబు, మండల ఎస్సీ సెల్ కార్యదర్శి దాసరి రవి, కాట్రగడ్డ సురేష్, వేముల నాగరాజు, మండల బీజేపీ అధ్యక్షుడు శ్రీనుబాబు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్మృతివనంలో వైసీపీ నీచ రాజకీయం

● టీడీపీ నేత దారా యేసురత్నం

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 10: విజయవాడ అంబేడ్కర్ స్మృతివనంలో అంబేడ్కర్ విగ్రహానికి ఉన్న జగన్ పేరును ఎవరో ఆగంతకులు తొలగిస్తే దానిని వైసీపీ నీచరాజకీయం చేస్తుందని టీడీపీ ఎస్సీ సెల్ నాయకుడు ధారా యేసు రత్నం అన్నారు. రాజమహేంద్రవరం దేవిచౌక్‌లోని తన కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. అంబేడ్కర్ విగ్రహ శిలాఫలకానికి ఉన్న జగన్ పేరును ఎవరో తొలగిస్తే వైసీపీ నాయకులకు సిగ్గులేకుండా రాద్ధాంతం చేస్తున్నారన్నారు. రాజకీయ ఉనికి కోసం అంబేడ్కర్ విగ్రహాలతో ఆటలాడితే ఊరుకునేదిలేదని హెచ్చరించారు. జాతిప్రయోజనాలను పక్కనపెట్టి పాకులాడే మాజీ మంత్రులు మేరుగ నాగార్జున, ఆదిమూలపు సురేష్‌లను జాతీ క్షమించదన్నారు.

కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్ ఇవ్వాలి

● యానిమల్‌బర్త్ కంట్రోల్ కేంద్రం తనిఖీలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 10: రాజమహేంద్రవరంలో శునకాల బర్త్ కంట్రోల్ శస్త్ర చికిత్సలు చేయడంతో పాటు రేబిస్ వ్యాధి సోకకుండా వ్యాక్సిన్ ఇవ్వాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వెటర్నరీ వైద్యులను ఆదేశించారు. రాజమహేంద్రవరం క్వారీ సెంటర్‌లో యానిమల్ బర్త్ కంట్రోల్ విభాగాన్ని శనివారం తనిఖీ చేశారు. ప్రతిరోజు జరిగే చర్యలను అడిగితెలుసుకున్నారు. శునకాలకు వ్యాక్సిన్ వేయడం వల్ల ప్రజలు సురక్షితంగా ఉంటారని తెలిపారు. అనంతరం వెటర్నరీ వైద్యురాలు బి.అరుణ మాట్లాడుతూ ఏబీసీలో వారానికి మూడు రోజులు వ్యాక్సినేషన్ ,రెండు రోజులు సర్జరీలు, శుక్ర,శనివారాల్లో యాంటి రేబిస్ ఇంజక్షన్ వేయడం జరుగుతుందన్నారు.

సెంట్రల్ జోన్ డీఎస్పీ కలిసిన టీడీపీ నేతలు

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 10: రాజమహేంద్రవరం సెంట్రల్ జోన్ డీఎస్పీ కె.రమేష్‌బాబును టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ, రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం డీఎస్పీ కార్యాలయంలో కలిసి మొక్కను అందించారు.

ఆజాదీకా అమృత్ మహోత్సవ్ ర్యాలీ

చాగల్లు, ఆగస్టు 10 : చాగల్లులో ఆజాదికా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా జాతీయజెండాతో జాతీయ సమైక్యతను చాటిచెప్పే విధంగా ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం నుంచి స్థానిక సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి సెంటర్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. గ్రామంలోని ప్రతి ఇంటిపైన, వ్యాపార, వాణిజ్య దుకాణాల షాపులపైన జాతీయజెండాను ఎగురవేయాలని ఎంపీడీవో ఎస్.బుజ్జి అన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఎస్‌కే సూర్జాన్, పంచాయతీ కార్యదర్శి ఎల్.రవికుమార్, అధికారులు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. మండలంలోని నె లటూరు, ఎస్.ముప్పవరం, మల్లవరం, చిక్కాల గ్రామాల్లోను పంచాయతీల ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో ర్యాలీలు నిర్వహించారు.



చాగల్లులో జాతీయజెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న పంచాయతీ సిబ్బంది

ఉండ్రాజవరంలో బీజేపీ మండల సమావేశం

ఉండ్రాజవరం, ఆగస్టు 10: ఉండ్రాజవరం మండల బీజేపీ పార్టీ కార్యకర్తల సమావేశం శనివారం ఉండ్రాజవరంలో నిడదవోలు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ బండి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, వివిధ అంశాల గురించి సమావేశంలో చర్చించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బి.శివరామకృష్ణ, అక్కిన గోపాలకృష్ణ, కరుటూరి నరేంద్రబాబు, బూరుగుపల్లి వెంకటేశ్వరరావు, సింహాద్రి సత్యనారాయణ, సీమకుర్తి నారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా మహాగణపతి విగ్రహ ప్రతిష్ఠ



ఖండవల్లిలో ప్రతిష్ఠించిన గణపతి విగ్రహం

పెరవలి, ఆగస్టు 10: ఖండవల్లిలో శ్రీ మహాగణపతి విగ్రహప్రతిష్ఠ మహో త్సవం ఘనంగా జరిగింది. ఐదురోజుల పాటు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి ఆదివారం నూతనంగా నిర్మించిన ఆలయంలో విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అదే గ్రామానికి చెందిన భూపతిరాజు వెంకట సత్యనారాయణరాజు, హిమబిందు, భూపతిరాజు శ్రీరామరాజు, సత్యమాధవి దంపతులచే ఈ ఆలయాన్ని నిర్మించారు.

15 నుంచి బీజేపీ ప్రజాప్రతినిధుల వారధి

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 10 : బీజేపీ నుంచి ఎన్నికైన కేంద్ర, రాష్ట్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్యేలు వారధి కార్యక్రమంలో భాగంగా ఈనెల 15వ తేదీ నుంచి విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కేంద్రకార్యాలయంలో అందుబాటులో ఉంటారని బీజేపీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు వెల్లడించారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజా సమస్యలపై వినతులు స్వీకరిస్తారన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి ప్రతి నెలలో మొదటి సోమవారం, మూడో సోమవారం అందుబాటులో ఉంటారన్నారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రతి నెలలో నాలుగవ సోమవారం, మంగళవారం అందుబాటులో ఉంటారన్నారు. రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రతి నెలలో మొదటి మంగళవారం, మూడో మంగళవారం అందుబాటులో ఉంటారని వెల్లడించారు. బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు సోము వీర్రాజు ప్రతి నెలలో రెండో సోమవారం, రెండో మంగళవారం అందుబాటులో ఉంటారన్నారు.

'దళిత క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్లు కల్పించాలి'

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 10 : జస్టిస్ రంగనాథ్,జస్టిస్ బాలయ్య కమిషన్ అంటు కమిటీలు వేసి కాలయాపన చేస్తున్నారే తప్ప దళిత క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్లు కల్పించడంలో పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఇండియన్ క్రిస్టియన్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు జార్జ్ శ్రీమంతుల ఆవేదన వ్యక్తం చేశారు. రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. దళితులు మతస్వేచ్ఛను కోల్పోయిన 1950 ఆగస్టు 10ని తాము బ్లాక్ డేగా పరిగణించామన్నారు. రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి స్పందించి కేంద్ర ప్రభుత్వం దృష్టికి దళిత క్రైస్తవుల సమస్యలు తీసుకువెళ్లి ఎస్సీ హోదా కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ పాస్టర్లు జి.నెల్సన్ బాబు, ఐసీఎఫ్ ప్రతినిధులు కె రాజేష్ బాబు, కె సాల్మన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

శంకరంబాడికి ఘన నివాళి

రాజమహేంద్రవరం కల్చరల్ ఆగష్టు10: మా తెలుగుతల్లి మల్లెపూదండ గేయ రచయిత శంకరంబాడి సుందరాచార్యుల 110 జయంతి వేడుకలు రాజమహేంద్రవరం రాకా సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. డాక్టర్ కంటే వీరన్నచౌదరి ఆసుపత్రి ఆవరణలో గల ఎస్పీ బాలు సాంస్కృతిక మందిరంలో శంకరంబాడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మునిసిపల్ కార్పొరేషన్ ఈఈ ఆలీ, రాకా అధ్యక్షుడు డాక్టర్ కంటే వీరన్న చౌదరి మాట్లాడుతూ మా తెలుగు తల్లి గీతం అజరామరమని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సన్నిధానం శాస్త్రి, తిరుమల కృష్ణమోహన్,సూరపురెడ్డి తాతారావు,వి.రాధాకుమారి,రాకా ప్రధాన కార్యదర్శి జివిరమణ,బి.రామకృష్ణమూర్తి,సాయి,దేవకుమార్ పాల్గొన్నారు.